విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్
గుంటూరు, పల్నాడు

శనివారం 18 జనవరి 2025 8 పేజీలు

లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా సుస్థిరా భివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంపై ప్రత్యేక దృష్టిపెట్టి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సుస్థిరాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాల సాధ నకు చేపట్టిన చర్యలపై కలెక్టరేట్లో కలెక్టర్ శుక్రవారం వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, డ్వామా, కో-ఆపరే టివ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు దిశా నిర్దేశం చేయడం జరిగిం దన్నారు. దేశానికి వెన్నెముకైన రైతాంగం అభివృద్ధి చెందితే మిగిలిన రంగాలు మరింత అభివృద్ధి చెందే అవ కాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో మరింత అవగాహన కల్పించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబాడులు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకం తగ్గించి పచ్చిరొట్ట, ఎరువులు వాడేలా చర్యలు తీసుకోవటం వల్ల తద్వారా భూ సారం పెరుగుతుందన్నారు. రైతుల కోసం నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులు, సిబ్బంది బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సందేహాలను నివృత్తి చేసి వ్యవసాయంలో చేపట్టాల్సిన మెలుకువలను వివరించి ఆదాయ మార్గాలను పెంచుకు నేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 131 ప్రాధ మిక వ్యవసాయ పరపతి సంఘాలుండగా కేవలం 69 సంఘాలను మాత్రమే ఎరువులు పురుగు మందులను విక్రయిస్తున్నాయని మిగిలిన వాటిలో విక్రయాలు నిర్వహించి రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రబీ సీజన్లో రైతులకు

మిగతా 2 లో

అమిత్ షా.. గో బ్యాక్

19న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజయవాడలో ఈ నెల 19న పర్యటించనున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలు అందరూ అమిత్ షా గో బ్యాక్ అంటూ నినదిస్తూ నిరసన నిర్వహించబోతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గుంటూరు మల్లయ్యలింగంభవన్ నుంచి వీడియో సందేశాన్ని ఆయన విడుదల చేశారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అవమానపరిచే పద్ధతుల్లో అమిత్ షా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ అంశంలో భారత జాతికి అమిత్ షా క్షమాపణ చెప్పాలని, తన ఎంపీ పదవికీ, హోంమంత్రి పదవికీ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే నిరసనల్లో వామపక్షాల కార్యకర్తలు, దళిత సంఘాలు, సామాజిక ఉద్యమకారులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గుంటూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాలలో కూడా నిరసనలు జరుగుతాయని, ఈ కార్యక్రమంలో అమిత్ షా గో బ్యాక్ అంటూ నినదిస్తూ ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించేలా అధికారులు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమ నిర్వహణపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయితీ సెక్రటరీలతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలన్న

మిగతా 2 లో

ప్రమాదాల నివారణకు

చర్యలు తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు, జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి హిట్ అండ్ రన్ కేసులు కలెక్టర్ సమీక్షిస్తూ సకాలంలో కేసు వివరాలు సంబంధిత సైట్‌లో నమోదు చేయడం ద్వారా క్షతగాత్రులకు బాధితులకు భీమా అందేలా చూడాలన్నారు. నేరాలు దోపిడీలు వంటివి జరుగకుండా హైవేలపై సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారి 65 గురజాడ క్రాసింగ్ లయాండర్ పాస్ వద్ద లైటింగ్స్, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. హైవేలపై ప్రయాణించే టూ వీలర్స్ వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ముఖ్యకేంద్రం మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సిగ్నల్స్ అన్ని పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, పరాసుపేట, బుట్టాయిపేట, జవారుపేట, నాగపోతరావు సెంటరు వంటి ప్రాంతాల్లో సిగ్నల్స్ లేని చోట్ల వాటిని ఏర్పాటు చేయాలని, రోడ్లపై పశువుల సంచారం ఎక్కువగా ఉండటం వలన ప్రమాదాలకు ఆస్కారం ఉన్నదని, ఈ సమస్య పరిష్కారానికి పశువుల కొమ్ములకు రేడియం పెయింట్ లేదా స్టిక్కర్ లేదా బెల్ట్ ఏది ఉత్తమమో ఆలోచించి చర్యలు తీసుకోవాలన్నారు. గో సంరక్షణ సంఘాలతో మీటింగ్ పెట్టి పశువులను రోడ్లపై వదలకుండా పశుపోషకులతో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ కె. చంద్రశేఖర రావు, జిల్లా రవాణా శాఖ అధికారి బి.ఎస్ఎస్ నాయక్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, ట్రాఫిక్ సిఐ శివకుమార్; జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ, జాతీయ రహదారుల సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ లత, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనకు పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఈనెల 18 నుంచి 19వతేదీ వరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటనకు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. శుక్రవారం ఆయన పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి హోటల్ నోవాటెల్‌లో బందోస్తు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమిత్‌షా రెండు రోజుల పర్యటన నేపథ్యంలో 18 వ తేదీన గన్నవరం విమానాశ్రయంలో దిగి అక్కడ నుండి రోడ్డు మార్గం గుండా విజయవాడ మీదుగా తాడేపల్లి ముఖ్యమంత్రి నివాసం చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం నోవాటెల్ కు వచ్చి రాత్రి బస తరువాత మరసటి రోజు ఉదయం హోటల్ నోవాటెల్ నుండి కృష్ణాజిల్లాలోని ఎన్.డి.ఆర్.ఎఫ్. వారి నిదం క్యాంపస్‌ను ప్రారంభోత్సవానికి హాజరువుతారన్నారు. ఈ నేపథ్యంలో గూడవల్లి నుండి ప్రకాశం బ్యారేజ్ వరకు సుమారు 16 కిలోమీటర్ల మేర రూట్, ప్రకాశం బ్యారేజ్ నుండి హోటల్ నోవాటేల్ వరకు రూట్ బందోబస్త్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కావున రూట్ ప్రదేశాలలో నోవాటెల్ పరిసర ప్రాంతాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. డీసీపీలు గౌతమీషాలి, ఎబీటీఎస్ ఉదయరాణి, కృష్ణమూర్తి నాయుడు, ఎస్‌వీడీ.ప్రసాద్, సబ్ కలెక్టర్ చైతన్య, ఏడీసీపీలు ఎం.రాజారావు, ఎవిఎల్ ప్రసన్న కుమార్, రెవిన్యూ,మున్సిపల్; ఫైర్,హెల్త్, ఎన్‌డీఆర్ఎఫ్ ఇతర శాఖల అధికారులతో ఏసీపీలు పాల్గొన్నారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌కు

5 స్టార్ 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికేట్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ రైల్వే స్టేషన్‌కు 5 స్టార్ 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికేషన్ లభించింది. రైల్వే స్టేషన్ డివిజన్‌లోనే పరిశుభ్రమైన, రుచికరమైన ఆహార పద్ధతుల కోసం ఎఫ్ఎస్ఎస్ఎఐ నుండి 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికేషన్ పొందిన డివిజన్‌లో రెండవ స్టేషన్. స్టేషన్ ప్రతిష్టాత్మకమైన ది ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ఈట్ రైట్‌గా తినండి ప్రయాణీకులకు సేవలో అత్యుత్తమ పరిశుభ్రమైన,సురక్షితమైన ఆహార పద్ధతులను అమలు చేసినందుకు స్టేషన్ సర్టిఫికేషన్ లభించింది. హైదరాబాద్ (నాంపల్లి) స్టేషన్ తర్వాత విజయవాడ రెండవ స్టేషన్‌గా ఎస్సీఆర్‌లో ఐదవ స్టేషన్‌గా 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికేషన్‌ను పొందింది. ఈట్ రైట్ స్టేషన్ సర్టిఫికేషన్ ఎఫ్ఎస్ఎస్ఎఐ ద్వారా ప్రామాణిక ఆహార నిల్వ, పరిశుభ్రత విధానాలకు కట్టుబడి రైల్వే స్టేషన్‌లకు మంజూరు చేస్తారు. రైలు ప్రయాణీకులకు అధిక-నాణ్యత, పోషకమైన ఆహారాన్ని అందించడం. ఈ సర్టిఫికేషన్ డివిజన్ నిబద్ధతకు, ప్రయాణీకులకు అత్యంత సురక్షితమైన, పరిశుభ్రమైన ప్రమాణాలతో సేవలను అందించాలని నిర్ణయించడం. ఈ ధృవీకరణను సాధించడం కోసం రైల్వే అధికారులు విజయవాడ రైల్వేస్టేషన్‌ను నామినేట్‌కు రోజూ 1 లక్షకు పైగా ప్రయాణికుల ప్రయాణించటం వలన నిర్ణీత నామినేషన్ ప్రక్రియ తర్వాత, ఎఫ్ఎస్ఎస్ఎఐ పమాణాల ప్రకారం ఎఫ్ఓఎస్ టిఏసి (ఫుడ్ సేఫ్టీ & ట్రైనింగ్ సర్టిఫికేషన్) ప్రోగ్రామ్ కింద క్యాటరింగ్ విక్రేతలు, స్టాల్ యజమానులు,ఫుడ్ హ్యాండ్లర్లు శిక్షణ పొందారు. దీనికి ప్రధానంగా రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్

మిగతా 2 లో

మొదటి పేజీ తరువాయి

లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టండి

అవసరమైన వరి, మినుము, మొక్కజొన్న వంటి విత్తనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. మామిడి, జామ, నిమ్మ, సపోటా వంటి ఫలసాయపు పంటలను చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని, కాంట్రాక్ట్ ఫార్మింగ్ పద్ధతి అమలుపై అవకాశాలను పరిశీలించాలన్నారు. పశు గనణ కార్యక్రమాన్ని ఫిబ్రవరి మాసంలోగా పూర్తి చేయాలని, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామి పథకం కింద జిల్లాలో 475 మిని గోకులాల షెడ్ల నిర్మాణం చేపట్టాలనే లక్ష్యం కాగా 523 నిర్మాణాలను చేపట్టి 335 నిర్మాణాలను పూర్తి చేయడం అభినందనీయమని రైతులు కోరిన చోట షెడ్ల నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్రీడ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం ద్వారా ఆడ దూడల సంతతిని పెంచే కార్యక్రమంపై మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామి పథకం ద్వారా పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టి రైతులకు పశుగ్రాసాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుస్థిరాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాల సాదనలో అధికారుల సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి డిఎంఎఫ్ విజయకుమారి, జిల్లా ఉద్యాన శాఖాధికారి బాలాజీకుమార్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి దివాకర్ బాబు, జిల్లా మార్క్ ఫెర్డ్ అధికారి కె.నాగమల్లిక, జిల్లా మార్కెటింగ్ అధికారి మంగమ్మ, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, మత్స్య శాఖాధికారి చక్రాణి పాల్గొన్నారు.

స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలి

లక్ష్యంతో ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ప్రతి నెల ఒక థీమ్‌తో 12 నెలలు స్వచ్ఛత కార్యక్రమాలను కాంపెయిన్ మోడ్‌లో నిర్వహించేలా మార్గదర్శకాలను జారీ చేశారన్నారు. మొదటి నెల జనవరి 18వ తేది శనివారం న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ దీమ్‌తో స్వచ్ఛత కార్యక్రమాలు జిల్లాలోని ప్రతి మున్సిపాల్టీలో, గ్రామ స్థాయిలోను నిర్వహించాలన్నారు. పురపాలక, పంచాయితీ శాఖలతో పబ్లిక్, ప్రైవేటు సంస్థలలోను స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహణకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన వ్యర్థాలు శుభ్రం చేయటం, కాల్వలు పూడికతీయుట, త్రాగునీరు ట్యాంకులు క్లీనింగ్, క్లోరినేషన్, వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సౌకర్యాలు పనులు కల్పన తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేస్తూ స్వచ్ఛత కార్యక్రమాలను వ్యక్తిగతంగా నిరంతరం నిర్వహించేలా వినుత్నమైన విధానాలతో కార్యక్రమాలను రూపొందించాలన్నారు. కార్యక్రమ నిర్వహణ పర్యవేక్షణకు శాఖల వారీగా నోడల్ అధికారులు నియమించాలన్నారు. శనివారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో, మున్సిపాల్టీలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో స్వచ్ఛత ఆంధ్ర - స్వచ్ఛత దివాస్ కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించాలని అన్నారు.

విజయవాడ రైల్వేస్టేషన్‌కు 5 స్టార్ 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికేట్

డాక్టర్ ఎమ్.సౌరిబాల బృందం ఎఫ్ఎస్ఎస్ఎఐ బృందం,విక్రేతలు, కాంట్రాక్టర్‌లతో క్రమం తప్పకుండా అనేక కౌన్సెలింగ్ సెషన్‌లను నిర్వహించారు. ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాలు, విక్రయదారుల వ్యక్తిగత పరిశుభ్రత, రక్షణ పరికరాలు, ఆహార ఉత్పత్తుల గడువు తేదీలు,ఉష్ణోగ్రత నియంత్రణ,చెత్త పారవేయడం, తడి,పొడి వ్యర్థాల విభజన వంటి అన్ని పారామితులను పరిగణనలోకి తీసుకుని నిరంతరం పర్యవేక్షించారు. ప్రారంభంలో ప్రీ-ఆడిట్ నిర్వహించబడింది మరియు చివరకు ఎఫ్ఎస్ఎస్ఎఐ ఎంప్యానెల్ థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహించబడింది.విజయవాడ రైల్వేస్టేషన్ జనవరి 2027 వరకు చెల్లుబాటుతో 'ఈట్ రైట్ స్టేషన్' సర్టిఫికేషన్‌ను పొందింది.

ఈ సందర్భంగా డిఆర్ఎం నరేంద్ర ఎ. పాటిల్, సీనియర్ డిసీఎం వావిలపల్లి రాంబాబు, సిఎంఎస్‌ను ఈ సర్టిఫికేట్ రావటానికి కృషి చేసిన డిసీఎం ఎమ్‌డి. అలీఖాన్, స్టేషన్ డైరెక్టర్ ఎం. శైలజ,ఎస్సీఆర్ డాక్టర్ ఫుడ్ సేఫ్టీ,డిఓ కె. అనిల్ కుమార్ అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: పడాల నాగు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ చిన్ని కృష్ణుని భక్త బృందంచే నూతనంగా ముద్రించిన 2025 క్యాలెండర్, డైరీని సీపీఐ 6వ డివిజన్ కార్యదర్శి పడాల కనకరావు, 24వ డివిజన్ కార్యదర్శి ముగడ కరుణాకర్, టీడీపీ అధ్యక్షుడు పడాల గంగాధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్త బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పడాల వాసు, మన్యాల శివ, కోరాడ చిన్ని, సగరపు అప్పారావు, సూరిబాబు, గొలగాని నాగరాజు, గార్లపాటి గోపి, మరిపి వెంకట జోగేశ్వరరావు, వద్ది సుబ్బారావు, మొకర గురునాథం తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: మహిళలు బాలికలలో రక్తహీనత నివారణ, మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్య మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అందించాలని లక్ష్యంతో ఉందని, క్షేత్ర స్థాయిలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి 10 నుండి 19 సంవత్సరాల వయస్సులోపు కలిగిన బాలికలు, 15 నుండి 49 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన మహిళలకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి రక్తహీనతను గుర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్తహీనత కలిగిన వారికి అవసరమైన

ఐరన్ టాబ్లెట్స్, ఇంజక్షన్‌లను పౌష్టికాహారం అందించి రక్తహీనతను నివారించేందుకు వైద్యులు, మాతాశిశు సంక్షేమశాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణీ స్త్రీలను గుర్తించి వారికి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేయాలని సాధ్యమైనంతమేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తరచు గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపకుండా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్ర పరిచి పౌష్టికాహారానికి సంబంధించిన ఆకుకూరలు, కూరగాయల మొక్కలను పెంచాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డియంహెచ్‌వో యం. సుహాసిని, డిసిహెచ్ఎస్ డిసికె నాయక్, ఎన్‌టిఆర్ ఆరోగ్య ట్రస్ట్ జిల్లా కో-ఆర్డినేటర్ జె. సుమన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపివోలు జి. మంగమ్మ, కె. నాగమణి, లక్ష్మీ బార్గవి, భాగ్యరేణుక, సత్యవతి, పుష్పవతి, నోడల్ ఆఫీసర్ సాయి గీత తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర రావు సేవలు ఆదర్శనీయం

విశాలాంధ్ర-ఘంటసాల: గొర్రెపాటి విద్యా ట్రస్ట్ కోశాధికారి గొర్రెపాటి చంద్రశేఖర రావు సేవలు ఆదర్శనీయమని ఎన్ఆర్ఐ గొర్రె రంగనాథ బాబు -ఇందిరా దంపతులు పేర్కొన్నారు. శుక్రవారం ఘంటసాల లో చంద్రశేఖర రావు ప్రధమ వర్ధంతి సందర్భంగా చంద్రశేఖర రావు చిత్రపటానికి ఎన్నారై రంగనాధబాబు-ఇందిరా దంపతులతో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రె పాటి వెంకట రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నారై రంగనాధ బాబు సహకారంతో గొర్రెపాటి విద్యా ట్రస్ట్ కోశాధికారిగా చంద్రశేఖర రావు గత 30 ఏళ్ల నుంచి పనిచేస్తూ అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు .ఈ కార్యక్రమంలో ఎన్నారై వేమూరి రాజేష్, చల్లపల్లి విజయ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ నాగళ్ళ భీమారావు, ఘంటసాల యు.వి.ఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపల్ లోయ నాగేశ్వరరావు, మచిలీ పట్నం విశ్రాంత జనరల్ మేనేజర్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్, బండి పరత్పరరావు, కొండపల్లి రామకృష్ణ, బలే వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు

మండలంలో పెన్షన్ల తనిఖీ

విశాలాంధ్ర - చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం చల్లపల్లి మండలంలో శుక్రవారం పెన్షన్ల తనిఖీ జరిగింది. తొలివిడత తనిఖీలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుల పెన్షన్లను వైద్యఅధికారులు తనిఖీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులుగా, మంచానికే పరిమితమైన వీరు రూ.10వేలు, రూ.15వేల చొప్పున ఫించన్ పొందుతున్నారు. చల్లపల్లి మండలంలోని గ్రామాల్లో 40 మంది పెన్షన్ దారులుండగా, మండల కేంద్రమైన చల్లపల్లిలో 12 మంది పెన్షన్దారులున్నారు. చల్లపల్లి ఎంపీడీవో డాక్టర్ ఎ.వి.రమణ పర్యవేక్షణలో రెండు బృందాలుగా అధికారులు తనిఖీలు చేపట్టారు. పించన్ దారుల ఇళ్లకు వెళ్లి వారి వ్యాధిగ్రస్థత, వికలాంగతను పరిశీలించి సంబంధిత ధృవీకరణ పత్రాలు పరిశీలించి ప్రత్యేక యాప్లో వారి ఫొటోను తీసుకున్నారు. డాక్టర్ ఎం.రవి, డాక్టర్ కె. సురేఖ, డాక్టర్ కెవి. పద్మావతిలు ఒక బృందంగా, డాక్టర్ సిహెచ్.శ్రీకాంత్, డాక్టర్ బిపి. పూర్ణిమ, డాక్టర్ విజయరావులు మరో బృందంగా తనిఖీలు చేపట్టారు. చల్లపల్లి కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.



ప్రజలకు అండగా ఉన్న వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి: కిరణ్ తేజ

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాలంటీర్స్ ద్వారా గడప గడపకు వెళ్ళి ప్రతి ఒక్క పథకం అందించారని నేడు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేయటంతో పేదప్రజలు అనేక కష్టాలకు గురవుతున్నారని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ వాలంటీర్ వింగ్ అధ్యక్షులు చందా కిరణ్ తేజ అరోపించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రావణకాష్టంలా చేస్తున్నారన్నారు. ఒక ప్రక్క విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు, కోడి పందాలు, జూదలు వంటి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. జగన్ ప్రభుత్వంలో ఎటువంటి అక్రమాలు జరగలేదని ప్రజలకు అండగా ఉండటమే కాకుండా వారికి ఎటువంటి నష్టాలకు గురి కాకుండా అనునిత్యం అండగా ఉన్నారన్నారు.వాలంటీర్స్ గడప గడపకు వెళ్ళి ప్రతిఒక్క పథకం అధించారు.ఈ వ్యవస్థను పూర్తిగా తీసేసి పక్కకి నెట్టేశారన్నారు. రాబోవు రోజుల్లో కూటమి ప్రభుత్వంన్ని ప్రజలు కూల్చడం ఖాయం. రాష్ట్ర ప్రజలు,వైఎస్ఆర్సీపీ నాయకులు కార్యకర్తలు ఈసారి వచ్చే స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్సీపీ జెండా ఎగురవేసి కూటమికి తగిన బుద్ధి చేపుతారన్నారు.

అనాధ వృద్ధులకు పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - చల్లపల్లి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నబీఘోరి ఆధ్వర్యంలో స్థానిక సీయోను వృద్ధాశ్రమంలో అనాధ వృద్ధులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు దిడ్ల కిరణుమార్, ప్రధాన కార్యదర్శి పసుమర్తి జాకబ్, కార్యనిర్వాహక అధ్యక్షులు చావలి రూబెన్బాబు, జిల్లా అధ్యక్షుడు మట్టా ప్రశాంతక్కుమార్లు పాల్గొన్నారు. వృద్ధాశ్రమంలో అనాధ వృద్ధులను సొంత కుటుంబం కంటే ఎక్కువ బాధ్యతతో దైవిక, మానవతా ధృక్పధంతో ఆశ్రయం కల్పించి పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు శీలం భాస్కరరావును కౌన్సిల్ ప్రతినిధులు అభినందించారు. కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ కొడాలి భక్తపాల్ సారధ్యంలో హక్కుల పరిరక్షణకై కృషిచేస్తున్నట్లు తెలిపారు.

సీఎం ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం : దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల్లో నైపుణ్యపరమైన శిక్షణతో కూడిన విద్యను 12 నెలలు పారిశ్రామిక అనుభవం అందించాలని సంకల్పించి 20 కంటే ఎక్కువ రంగాల్లో యువత ఇంటర్న్‌షిప్ అవకావాలు కల్పిస్తోంది. ఇంటర్న్‌షిప్ చేయాలనుకునే వారికి దేశ వ్యాప్తంగా అవకాశాలున్నాయి. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ద్వారా రాబోయే 5 సంవత్సరాల్లో దేశంలోని టాప్ 500 కంపెనీల్లో కోటి మంది యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ ప్రారంభమైందని జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ తెలిపారు. ఇంటర్న్‌షిప్ స్కీమ్ అర్హత సాధించడానికి ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి ఉండాలి. ఐటిఐ సర్టిఫికెట్, పాలిటెక్నిక్ ఇన్స్టిట్యూట్ నుండి డిప్లొమా లేదా బిఎ, బిఎస్సీ, బీకాం, బిసిఎ, బిబిఎ, బిఫాం వంటి డిగ్రీని కలిగి ఉన్న వారు ఆన్లైన్ లేదా దూరవిద్య ప్రోగ్రాంలో నమోదు చేసుకున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.

డాక్యుమెంట్స్ పోయినవి

కోన సోమశేఖర్ S/o. కోన నాగేశ్వరరావు, డోర్ నెం. EWS-313, ఉడా కాలనీ, రాజీవ్ నగర్, పాయకాపురం, విజయవాడ, యన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్ అను నేను యావన్మందికి తెలియ జేయునది ఏమనగా. గాంధీనగర్, విజయవాడ సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో ది.06-07-2004న **మంచికంటి భాగ్యలక్ష్మి** అను వారి పేరుతో రిజిస్ట్రీ అయిన విక్రయ **దస్తావేజు నెం. 9284/2004**గల ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ అక్టోబరు 2024 సం॥న సంభవించిన వరదల కారణంగా పోయినవి. ఎంత వెతికిన కనబడలేదు. సదరు స్థలముపై యెటువంటి అన్యాక్రాంతములు గాని, తాకట్టులుగాని యేమియు లేవనియు యిందు మూలముగా తెలియ జేయుచున్నాను. సదరు దస్తావేజు ఎవరికైననూ దొరికినచో నాకు అప్పగించగలరు.

సంప్ర. **81255 64675**

అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర-పెదపారుపూడి: నియోజకవర్గ కేంద్రమైన పామర్రు సెంటర్లో అన్న క్యాంటీన్ పక్కా భవన నిర్మాణం కొరకు స్థలాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా స్థానిక అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవికాంత్, ఆర్ఐ రాము, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి తాడిశెట్టి నరేష్, సాగునీటి సంఘ (ప్రాజెక్టు కమిటీ)(పిసీ) వైస్ చైర్మన్ వల్లూరు పల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

21న అమ్ముల విశ్వనాథం జయంతి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్: అమ్ముల స్మారక సమితి ఆధ్వర్యంలో హరికథకరాజహంస డాక్టర్ అమ్ముల విశ్వనాథ భాగవతార్ 109వ జయంతి ఈ నెల 21వ తేదీ మంగళవారం సాయంత్రం ఘంటసాల సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలోని కళావేదికపై జరుగుతుందని నిర్వాహకులు భాస్కర్ల వేంకట శ్రీసతీష్, బీవీ దుర్గాభవానీ తెలిపారు. ఆయన పేరిట ప్రతి ఏటా అందించే స్మారక పురస్కారాన్ని ఈ ఏడాది హరికథ చూడామణి జయంతి సావిత్రి భాగవతారిణి(తిరుపతి)కి ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె హరికథ గానం జరుగుతుందని తెలిపారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-కంచికచర్ల: మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గని అత్కూర్, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట ఆవశ్యకత ఇంకా పంటల భీమా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నందిగామ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ అఫ్ అగ్రికల్చర్ ఐకే శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి కె.విజయ్ కుమార్ గ్రామీణ వ్యవసాయ సహాయకురాలు సాహిత్య రుచి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంట దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, చీడ,పీడల నివారణకై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వైభవంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం

విశాలాంధ్ర - గుడివాడ : శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థాన మండపంలో సంకష్టహర చతుర్థ సందర్భంగా శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన లక్ష్మీ గణపతి హెూమ పూజల్లో 90 మంది దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హెూమగుండంలో పూర్ణా హుతిని సమర్పించారు. లోక కళ్యాణార్థమే దేవస్థానంలో సంకటహార శ్రీలక్ష్మీ గణపతి హెూమ పూజలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు) తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి: తెలుగు వారి ఘనతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ నందమూరి తారక రామారావు వర్ధంతి సభ మండలంలోని వెంట్రప్రగడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం 9 గంటలకు జరుగుతున్నందున మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, టిడిపి సీనియర్ నేత సూరపనేని వెంకట సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సూర్యఘర్ కనెక్షన్ల మంజూరులో

జిల్లాను ప్రథమంగా నిలుపుదాం: కలెక్టర్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): జిల్లాలో ప్రతి ఇంటా సూర్యఘర్ వెలుగులు నింపేందుకు సూర్యఘర్ కనెక్షన్ల మంజూరులో జిల్లాను ప్రథమంగా నిలిపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ ఆదేశించారు. ఇందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేసేలా చూడాలన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ కనెక్షన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా జిల్లాలో రెండు లక్షల గృహాలకు సౌర విద్యుత్ కనెక్షన్లు అందించాలనే లక్ష్యంగా నిర్దేశించామన్నారు. పట్టణ ప్రాంతాల్లో సూర్యఘర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం అధిక రాయితీనిచ్చి తక్కువ పెట్టుబడితో ఉచితంగా సౌర విద్యుత్ను పొందవచ్చనే విషయాన్ని ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రూ.2లక్షల విలువైన సోలార్ ప్యానెల్స్కు ఎసీ, బీసీ వర్గాలకు, స్వయం సహాయక బృందాలకు రూ.78వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూ.20వేలు లబ్ధిదారు వాటాపోనూ మిగిలిన మొత్తాన్ని తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణంగా మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి పూర్తి రాయితీతో పొందే అవకాశం ఉందన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ మురళీమోహన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విద్యుత్శాఖ అధికారులు విస్సన్నపేట మండలంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యుత్ అధికారులు, సిబ్బంది కలసి, ఒక్కసారిగా మండలంలోని వినియోగదారుల వివరాలు, వారు విద్యుత్ వినియోగిస్తున్న తీరు, బిల్లుల జమ వివరాలపై తనిఖీలు చేపట్టి, వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా గృహ వినియోగ విద్యుత్ను వాణిజ్య అవసరాలను వినియోగించటం, అదనపు విద్యుత్ వినియోగం, మీటర్లు లేకుండా అక్రమ విద్యుత్ తదితరాలపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. విద్యుత్ విజిలెన్సు ఈఈ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం, 40 బృందాలతో మండలంలో 2,118 గృహ, 264 వాణిజ్య కనెక్షన్లను పరిశీలన చేశామన్నారు. వీటిలో 138 వినియోగదారులు అదనంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించి, వారికి రూ.6,18,800ల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కేటగిరీ మార్చి వినియోగిస్తున్న ఇరువురు, విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న మరో ఎనిమిది మందిని గుర్తించి, వారికి రూ.10వేలు జరిమానా విధించామన్నారు. నూజివీడు ఈఈ సత్యనారాయణ, విస్సన్నపేట ఏఈ ఎస్.విజయభాస్కర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్య పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: తెల్లదేవరపల్లి గ్రామంలో రైతులు ఎదు ర్కొంటున్న భూమి సమ స్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు తహశీల్దారు కె.లక్ష్మీకల్యాణికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని భూములను ప్రభుత్వం రెడ్మార్కు పేరుతో నిషిద్ధభూముల జాబితాలో చేర్చింది. నాటి నుంచి ఈ భూములను విక్రయించుకునే, బ్యాంకుల నుంచి రుణం పొందే అర్హతను రైతులు కోల్పోయారు. గ్రామంలోని రైతుల్లో అగ్రభాగం పేద, గిరిజన, ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన కుటుంబాలకు చెందినవారమని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. ఉన్నతాధికారులు దృష్టికి సమస్యను తీసుకెళ్లి, ఏళ్ల తరబడి కొనసాగుతున్న తమ భూసమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి రాయల నాగరాణి, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర నాయకుడు డి.హరినాథ్, పంచాయతీ ఉపసర్పంచి ధారావతు చలపతి, గ్రామ ప్రముఖులు రాయల సురేష్, ధారావతు నాగమల్లేశ్వరరావు, ధారావత్తు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జముఖి వాయిద్య ప్రజా కళాకారుడు కామేశ్వరరావు మృతి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజా కళాకారుడు, రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూ పదవీ విరమణ తర్వాత కూడా జముఖి వాయిద్య కళాకారుడుగా అనేక ప్రదర్శనలు ఇస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి వేదికలపై వాయిద్య సహకారం అందించిన బంతుల కామేశ్వరరావు (84) చిట్టినగర్ ప్రాంతంలో నివసిస్తున్నారు. అనారోగ్యం కారణంగా శుక్రవారం ఉదయం హాస్పిటల్లో చేరగా చికిత్స పొందుతూ మృతి చెందారు. నగర ప్రజానాట్యమండలి ఇన్చార్జ్ లంక దుర్గారావు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి జెఎం శర్మ, నగర కార్యదర్శి దోనేపూడి సూరిబాబు నివాళులర్పించారు దుర్గారావు మాట్లాడుతూ ప్రజానాట్యమండలికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ అంతరించిపోతున్న జముఖి వాయిద్య కళకు జీవం పోశారని అన్నారు. కామేశ్వరరావు లేని లోటు నగర ప్రజానాట్యమండలికి తీరనిలోటని పేర్కొన్నారు.. ఆయన కోరిక మేరకు భౌతికకాయాన్ని ఎన్నారై వైద్య కళాశాలకు కుటుంబ సభ్యులు అందజేశారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి శాఖమూరి రంగారావు, మాజీ కార్పొరేటర్ డివి రమణబాబు, దాసరి రంగారావు, గొల్లపల్లి జానీ, రైల్వే మజ్దూర్ యూనియన్ పిఎస్ చరణ్, సిపిఐ డివిజన్ కార్యదర్శి లంక ప్రసాద్ ,చిక్కాల సునీల్ కుమార్ తదితరులు పాల్గొని సంతాపం తెలియజేసి కామేశ్వరరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

చినముత్తేవి వంతెనపై వృధాగా పోతున్న మంచినీరు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-కూచిపూడి: ప్రతిరోజు ఐలూరు గ్రామంలో ఉన్న కృష్ణానది నుంచి నీరు మండలంలో అన్ని గ్రామాలకు సరఫరా జరుగుతోంది. గత కొన్ని రోజుల నుంచి మంచినీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పండగ సందర్భంలో కూడా సకాలంలో మంచినీరు పైపుల ద్వారా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందిపాలైనారు. మరోపక్క ఐలూరు కృష్ణానది నుండి నిడుమోలు వరకు ఉన్న పైపులైన్ ద్వారా సరఫరా అవుతున్న కృష్ణా జలాలు చినముత్తేవి మురుగు కాలువ వంతెన వద్ద లీక్ అయి వృధాగా రోడ్లపైకి కాలువలోకి వెళుతున్నా అధికారులు దృష్టిపెట్టకపోవడం దురదృష్టకరం. గత సంవత్సర కాలంగా జరుగుతున్న మధ్య మధ్యలో చిన్నపాటి రిపేర్లు మాత్రమే చేస్తు న్నారు. పూర్తి స్థాయిలో పైప్ లైన్లు మర మ్మతులు చేపట్టి ప్రజలకు మంచినీటిని ప్రతిరోజు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పైప్ లైన్ మరమ్మతులను పూర్తి చేసేందుకు కృషి చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. చిన్నచిన్నమరమ్మత్తులపై అధికారులు దృష్టి పెట్టకపోవడం పట్ల ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుడివాడ : శ్రీ కోదండ రామస్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద గల శ్రీ కోదండ రామాలయంలో 80వ వార్షిక ధనుర్మాసోత్సవాలు వైభవోపేతంగా ముగియడంతో శాంతి నిమిత్తం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దానాలకెల్లా అన్నదానం గొప్పదన్నారు. అన్న సమారాధనలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దొక్కు రాంబాబు, మున్సిపల్ మాజీ చైర్పన్ లంకదాసరి ప్రసాదరావు, టిడిపి నాయకులు కడియాల గణేష్, చేకూరు జగన్మోహన్రావు, సయ్యద్ గఫార్, చంటి, దేవస్థాన కమిటీ సభ్యులు దారపురెడ్డి వెంకన్న, మెరుగుమోల రామకృష్ణ, రాయపురెడ్డి రాజేంద్రప్రసాద్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. లలితాదేవి సృష్టి స్థితిలయాధికారిని :

ఆలయంలో పూజలు, పారాయణం

విశాలాంధ్ర-విజయవాడ: ఈ రోజు పూర్ణానంద పేట శ్రీ దాసాంజనేయ కోదండరామ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర శ్రీవెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శ్రీ లలితా సహస్రనామ పారాయణ మండలి వార్షికోత్సవ వేడుకలలో భాగంగా అమ్మ వారిని అలంకరించి, 81 మంది పుణ్య స్త్రీలు సంప్రదాయ పద్ధతిలో లలితా దేవి ఉపాసన పూజలు, పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టీ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా ఆధ్యాత్మిక వ్యాఖ్యానం చేస్తూ లలితా సహస్రనామ పారాయణ విశిష్టతను గూర్చి తెలిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాలు భక్తులకు అందజేశారు.

గృహాల రీసర్వే సభకు స్పందన కరవు

విశాలాంధ్ర-కూచిపూడి: గ్రామంలో త్వరలో నిర్వహించనున్న డొమెస్టిక్(గృహాల) రీసర్వే కోసం శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు స్పందన కొరవడింది. దీనికోసం మైక్ ప్రచారం సైతం నిర్వహించారు. అయినా గ్రామస్తులు హాజరు కాకపోవటం గమనార్హం. సచివాలయ సిబ్బందితోపాటు డ్వాక్రా లీడర్లు మాత్రమే హాజరయ్యారు. అలాగే కార్యదర్శి కే పుష్పనాథంకు మండల పరిషత్ కార్యాలయంలో శాఖపరమైన సమావేశం నిర్వహించడంతో ఈ సమావేశాన్ని సిబ్బంది నిర్వహించమని ఆయన సమావేశానికి హాజరయ్యారు. మధ్యాహ్నం ఒంటిగంట దాటిన తర్వాత ఆ ఇద్దరు సమావేశానికి హాజరై సమావేశం అయిందనిపించారు. కూచిపూడిలో 62.38 ఎకరాలలో గల గ్రామ కంఠంలోని 1100కు పైగా గల గృహాలపై నిర్వహించే ఈ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని కోరడం కోసం ఈ సభను ఏర్పాటు చేసినట్లు సమాచారం.

మున్సిపాలిటీకి 600 ఇళ్లు కేటాయింపు

విశాలాంధ్ర-పెనమలూరు: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 600 ఇళ్లు తాడిగడప మున్సిపాలిటీకి కేంద్రం కేటాయించిందని కమీషనర్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని తాడిగడప, పోరంకి, కానూరు, యనమలకుదురు గ్రామాల్లో అర్హులు ఈ పథకం కింద లబ్ధి పొందవచ్చని తెలిపారు. ఇంటి స్థలం ఉండి పక్కా గృహం లేని వారు ఈ పథకానికి పెట్టుకుంటే అర్హులకు రూ 2.4 లక్షలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. తగిన ఆధారాలతో ప్రజలు హౌసింగ్ ఏఈ కు అర్జీలను పెట్టుకుంటే ఏప్రిల్ లో నిధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. భార్య, భర్తల ఆధార్, ఆధార్ ఇచ్చిన బ్యాంకు ఖాతా, రేషన్ కార్డుల నకళ్ళతో సంప్రదించాలని సూచించారు.

జలదీశ్వరుని సేవలో దమ్మాలపాటి

విశాలాంధ్ర - ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాలలో వేంచేసి ఉన్న శ్రీ బాల పార్వతి సమేత జలదీశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మొవ్వ ఉమామహేశ్వర రావు విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. దేవాలయ చిత్రపటం, చరిత్ర పుస్తకాలు అందించారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం అందుకున్న వడ్లమూడి

విశాలాంధ్ర-విజయవాడ: తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న వరికుంటపాడు మండల స్థాయి యువ నాయకుడు వడ్లమూడి నాగేంద్రకు పలువురు అభినందనలు వెలువెత్తున్నాయి. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం కార్యక్రమానికి విశేషమైన స్పందన లభిస్తోందని తెలిపారు. పార్టీ బలోపేతానికి యువత ముందుకు రావడం మరింత ఉత్సాహాన్ని నిస్తోందని తెలిపారు. శాశ్వత సభ్యత్వం తీసుకుని పార్టీ పట్ల తనకు ఉన్న ఆసక్తిని వ్యక్తం చేసిన నాగేంద్రను అభినందించారు.

మోదీకి రఘురామ్ ధన్యవాదాలు

విశాలాంధ్ర-విజయవాడ: వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటించడం చారిత్రాత్మకమైనదని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘు రాం అన్నారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రధానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రసక్తే లేదని ప్రకటించిన కేంద్ర మంత్రి కుమారస్వామి వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని ప్రకటించారు. ప్యాకేజీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో కష్టపడ్డారని ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్ కాపాడుతామన్న ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు.

గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలని పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ అన్నారు శుక్రవారం మండల పరిధిలోని పులిగడ్డ పంచాయతీ కార్యాలయంలో నూతన పారిశుద్ధ్య రిక్షాలను సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు పులిగడ్డ పిచ్చేశ్వరావు సెక్రెటరీ అనిత పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై కూటమి ప్రభుత్వం వివక్ష

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీ నగర్) : క్రైస్తవులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసపూరితంగా ఉంటూ వివక్షత చూపుతున్నారని వైసీపీ క్రిస్టియన్ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్ బెన్నీ లింగం ఆరోపించారు. శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బిజెపి చేతిలో కీలుబొమ్మలా ఉండి హిందూత్వవాదాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో చర్చిలపై పాస్టర్లపై దాడులు జరుగుతున్న ఈ కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. క్రైస్తవ మతాన్ని అణగ తొక్కటానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. నేను సనాతవాదిని అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇతర మతాల్ని విమర్శించే రీతిగా వ్యవహరిస్తున్నారన్నారని దానికి చంద్రబాబు వత్తాసు పలుకుతున్నారన్నారు. అన్ని మతాలు కలిసిమెలిసి ఉంటుంటే వీరు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. ఇటీవల చిత్తూరు జిల్లా రేణిగుంట ఎస్టీ చెందిన ఒక పాస్టర్ పై దాడి చేసి అక్కడ ఉన్న చర్చిని కూల్చివేశారన్నారు. పుంగనూరులో సువార్త ప్రకటిస్తున్న కొంతమంది పాస్టర్లపై దాడి జరిగింది. ప్రభుత్వం చూస్తూ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు పేద దైవ సేవకులు కొరకు గౌరవ వేతనం ఏర్పా టు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో 9 నెలల నుండి ఇవ్వటం లేదన్నారు. అర్హులైన పేద దైవ సేవకులు ఉన్నారు వారిని ఆదుకోవటంతో పాటు చర్చిల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, జెరూసలేం యాత్రకు నిధులు పెంచాలి లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ప్రయాణికులకు నాణ్యత కలిగిన సేవలు అందించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీ నగర్) : ప్రయాణీకులు అధిక-నాణ్యత సేవలు అందించి ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభవాన్ని పొందే విధంగా కృషి చేస్తున్నామని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు తెలిపారు. శుక్రవారం రైలు నెం.11020 ముంబై-భువనేశ్వర్ వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌ను విజయవాడ నుండి తాడేపల్లిగూడెం వరకు విస్తృతంగా తనిఖీలు చేశారు. రైలులో అందిస్తున్న ఆన్‌బోర్డ్ క్యాటరింగ్ సేవల నాణ్యత, పరిమాణాన్ని పరిశీలించారు. అందుతున్న సౌకర్యాలుపై ప్రయాణీకుల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణీకులతో అవసరాలను మర్యాదగా, శ్రద్ధగా ఉండాలని క్యాటరింగ్ బృందానికి సూచించింది. వంట చేసే ప్రదేశంలో నాణ్యత పరిశుభ్రతను పరిశీలించారు. వంటకు ఉపయోగించే పదార్థాల గడువు తేదీలను కూడా వారు తనిఖీ చేశారు. ప్రయాణీకుల డిమాండ్‌పై ఫిర్యాదు పుస్తకాన్ని అందించాలన్నారు. అనంతరం తణుకు,గూడెం స్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ పునరాభివృద్ధి పనులు పరిశీలించారు. రైలు కార్యకలాపాలలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం,ప్రయాణీకుల ఫిర్యాదులను పరిష్కరించడంపై ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈయన వెంట క్యాటరింగ్, కమర్షియల్ సిబ్బంది ఉన్నారు.

నలబై వేల చేరువలో టీడీపీ సభ్యత్వాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలు నలభై వేల మార్కుకు చెరువైనట్లు అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం నేతలు బొబ్బా గోవర్ధన్, బండే శ్రీనివాసరావు తెలిపారు.. టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చివరి అంకానికి చేరుకున్న తరుణంలో ప్రతీ ఒక్క తెలుగుదేశం పార్టీ అభిమానికి సభ్యత్వం అందించేలా నియోజకవర్గ కార్యాలయంలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసారు.. గతంలో స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వం పొందిన ప్రతీ ఒక్కరినీ గుర్తించి వారి సభ్యత్వాలు రెన్యువల్ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికి సభ్యత్వం కావాలన్నా నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ వాలంటీర్లు అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా బొబ్బా గోవర్ధన్ సూచించారు. కోడూరు మండలంలో మిగిలిన సభ్యత్వాలను శుక్రవారం పూర్తి చేయగా ఈ కార్యక్రమంలో గోగినేని సోమశేఖర రావు, మేడికొండ విజయ్, గంజాల సుందరరావు, బచ్చు రఘునాథ్, రేపల్లె ప్రతాప్, కాగిత ఆంజనేయులు, హరికుమార్, కురుకుల శివయ్య, శివ ప్రసాద్, బండే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

విశాలాంధ్ర-ఎ.కొండూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర ధారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం గణేష్ మినీ ఫంక్షన్ హాల్ లో ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల స్థాయిలో గడ్డి సత్యనారాయణ రెడ్డి జ్ఞాపకార్థం, సంక్రాంతి పండుగ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి సతీమణి గడ్డి రోజా రాణి ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనంతరం వాలీబాల్ పోటీల్లో విన్నర్స్ గా నిలిచిన టీంకు గడ్డి కృష్ణారెడ్డి, ఎస్సై చల్లా కృష్ణ చేతుల మీదుగా రూ.5వేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్న రామచంద్రపురం టీంకు 2,500ల నగదు బహుమతిని షేక్ షరీఫ్ అందజేశారు. షటిల్ పోటీలలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న ఎ.కొండూరు టీంకు రూ 5వేల నగదు బహుమతిని గడ్డి కృష్ణారెడ్డి, రోజా రాణి దంపతులు అందజేశారు. ద్వితీయ బహుమతి గెలుచుకున్న రామచంద్రాపురం టీంకు రూ 2500 రూపాయలు నగదును కొప్పుల శ్రీహర్ష అందజేశారు.

వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-అవనిగడ్డ: నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో మాజీ జడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వర రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు నియోజవర్గ నేత బొబ్బ గోవర్ధనల ఆధ్వర్యంలో కేకులు కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వెంకటేశ్వరావును దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ: ఆర్టీసీ సర్వీసులలో ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ మాజీ మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు కొనకళ్ల నారాయణరావుకు ఆర్టీసీ యూనియన్ నాయకులు మండలి వెంకటేశ్వర రావు శుక్రవారం మచిలీపట్నంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జీవన భృతి సూపర్ లగ్జరీ గరుడ ఇంద్ర సర్వీసులలో ఉచితంగా రవాణా సౌకర్యం ఆర్టీసీ సిబ్బందికి కలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ఎలాంటి లోపం లేకుండా చూడాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : చెత్త సేకరణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, ప్రతి నిత్యం వ్యర్థ సేకరణ కచ్చితంగా జరుగుతుండాలని, నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగర పర్యటనలో భాగంగా శుక్రవారం 21వ డివిజన్, కృష్ణలంక ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు నిత్యం వ్యర్థ సేకరణ ఖచ్చితంగా జరుగుతుండాలని, ఆయా వార్డుల్లో తరచుగా వ్యర్థాలు వేసే ప్రదేశాలను గుర్తించి, ఆ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలిగిస్తూ పరిశుభ్రపరుస్తుండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదే డివిజన్‌లో ఏపిఎస్ఆర్ఎమ్ పాఠశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఆహార నాణ్యతను పరిశీలించిన ఆయన నాణ్యతలో ఎలాంటి లోపం లేకుండా చూడాలని, పరిశుభ్రతలో కూడా ఏ విధమైన లోటుపాట్లు లేకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-వీరులపాడు: 2004-05 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శుక్రవారం జుజ్జూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకుని తమ తోడ్పాడు నందించేదుకు గాను సహచర విద్యార్థులందరూ కలిసి లక్ష 30 వేల రూపాయల వ్యయంతో సైకిల్ స్టాండ్‌ను నిర్మించి తమ ఉపాధ్యాయులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయురాలు పసుపులేటి శారదా మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి అనే సామెతలు గుర్తుంచుకొని ప్రతి ఒక్కరూ స్నేహానికి విలువ ఇచ్చి ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకోవాలని అన్నారు. మరో ఉపాధ్యాయుడు రాయల కోటేశ్వరరావు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయంగా సైకిల్ స్టాండ్‌ను నిర్మించి పాఠశాల అభివృద్ధికి తోడ్పడునందించడం అభినందనీయమని అన్నారు. మిగిలిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ 20యేళ్ల తర్వాత కూడా మమ్మలను గుర్తించి గౌరవించడం సంతోషంగా ఉందని అన్నారు. తదనంతరం గత తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా సాయంత్రం వరకు అక్కడే గడిపి, చివరగా విద్యార్థులందరూ కలిసి ఉపాధ్యాయులను శాలువాలు మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమం తోటి విద్యార్థులు అందరినీ కలుపుకొని కొమ్మూరి శేషు, భాను నాయక్, కంభంపాటి వరలక్ష్మి, నెమలిపురి వెంకట్రావు దిగ్విజయంగా నిర్వహించారు.

ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని, రహదారి భద్రతా మాసోత్సవాల ద్వారా ప్రజలను చైతన్య వంతులను చేసి రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉప రవాణాశాఖాధికారి ఎ.మోహన్ తెలిపారు. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాల నిర్వహణపై స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా పట్ల, మోటర్ వాహన చట్టాలపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించడంతో పాటు వివరించేలా జిల్లాలో నెల రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదాల నివారణకు రవాణా శాఖ ఆధ్వర్యంలో పోలీస్, వైద్య ఆరోగ్య, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అనేక కార్యక్రమాలను చేపట్టటం ద్వారా కొంత మేరకు ప్రమాదాలను నివారించామన్నారు. అనంతరం రహదారి భద్రతా గుడ్ సమరిటన్‌పై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, రవాణాశాఖ అధికారులు ప్రవీణ్, వెంకటేశ్వర్రావు, శివరాంగౌడ్, సత్యన్నారాయణ, అబ్దుల్ సత్తార్ పాల్గొన్నారు.

రేపు విజయవాడలో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర-దాచేపల్లి: ఈ నెల 19న ఆదివారం సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయం దాసరి భవన్‌లో జరుగుతుందని పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా, పట్టణ, ప్రాంతీయ, మండల, నియోజకవర్గ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు బాధ్యత తీసుకొని విధిగా హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశానికి వచ్చే వారంతా పార్టీ సభ్యత్వాల వివరాలు కూడా తీసుకు రావాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తూ
19న జిల్లా వ్యాప్త నిరసనలు

- వామపక్ష పార్టీలు పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, అప్రతిష్ఠాకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ ఈ నెల 19వ తేదీన జిల్లాలోని అన్ని ప్రాంతాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్షపార్టీలు పిలుపు నిచ్చాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను అభిమానించే వారిని ఎగతాళిచేస్తూ అంబేద్కర్ జపం చేయడం ఫ్యాషన్‌గా మారిందని, ఆ జపం ఏదో దేవుడిని తలుచుకుంటే స్వర్గమన్నా వచ్చేదంటూ అత్యంత అభ్యంతరకరమైన అమిత్‌షా వ్యాఖ్యలపై దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు పెల్లుబికినా, నిరసనలు వెల్లువెత్తినా, కేంద్రం బీజేపీ వైఖరిలో మార్పులేదు. ఈ నేపథ్యం లో అమిత్‌షా 19వ తేదీన విజయవాడ పర్యటనకు రానున్నారు. ఈ పర్యటనను వ్యతిరేకిస్తూ జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని గుంటూరు జిల్లాలోని వామపక్ష పార్టీలు పిలుపునిస్తున్నాయి. ఈ ప్రకటన చేసిన వారిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, సిపిఐ (ఎమ్.ఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి విష్ణు, సిపిఐ (ఎమ్.ఎల్) జిల్లా నాయకులు ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, సిపిఐ (ఎమ్.ఎల్) ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు, సిపిఐ(ఎమ్.ఎల్) లిబరేషన్ నాయకులు రాందేవ్ తదితరులు ఉన్నారు.

నేడు గుంటూరుకు పెమ్మసాని పర్యటన

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం తెనాలి మండలం నందివెలుగు జడ్పీ హైస్కూల్‌లో నూతన భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం గుంటూరు కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటి సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం కొరిటిపాడు, ఇన్నర్ రింగ్‌రోడ్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరణలో పాల్గొంటారు.

కంది పంటను కాల్చిన దుండగులు

- ఇద్దరు రైతులకు రూ.2 లక్షల నష్టం

విశాలాంధ్ర-దాచేపల్లి : కృష్ణానది తీరానున్న భట్రుపాలెం గ్రామంలో రైతులు కష్టపడి పండించిన కంది పంటకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి కాల్చేశారు. కేతావతు సైదా నాయక్, భుక్యా రమణా నాయక్ చెరో మూడెకరాల్లో కందిని సాగు చేసి కష్టపడి పండించారు. కోసిన కంది పంటను పొలంలోని కల్లంలో ఆరేసిన పడుగు కుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అంతా కాలి బూడిదైంది. ఆరుగాలం కష్టపడి పండించ డంతో చేతి కొచ్చిన కంది పంట కళ్ళ ముందే పూర్తిగా కాలి బూడిద కావడంతో బాధిత రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. రూ.2 లక్షలకు పైబడి నష్టం వాటిల్లినట్లు చెప్పారు. ఈ సంఘటన నపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతులు తెలిపారు.

పథకాలు అమల్లో అలసత్వం వహిస్తే చర్యలు : చీఫ్ విప్ జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : అర్హులైన పేదలందరికీ పథకాలు సక్రమంగా అందాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని అధికారులను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖపై సమీక్ష సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం వైపు నుంచి తీసుకుంటున్న చర్యలు ఫలాలు ప్రజలకు చేరేలా అధికారులు సమర్థంగా పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. వినుకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా అంగన్వా డీలకు అండగా ఉంటున్నామన్న ఆయన చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్వాడీ ఉపాధ్యాయ, సహాయకుల పోస్టుల వెంటనే భర్తీ చేపట్టనున్నా మన్నారు. త్వరలో ఉద్యోగ ప్రకటనలు జారీ కానున్నాయని చెప్పారు. అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో 366 అంగన్వాడీలుంటే వాటిల్లో 84 స్వంత భవనాల్లో, 92 పాఠశాలలు, పంచాయతీ భవనాల్లో నడుస్తున్నాయని, 140 వరకు అద్దెభవనాల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. 29 భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉందని, త్వరలోనే వాటిని పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో గర్భవతులు 1949 మంది, బాలింతలు 2006మంది, 6ఏళ్ల లోపు చిన్నారులు 17581 మంది ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సకాలంలో, సక్రమంగా చేర్చాలన్నారు. వైసీపీ ప్రభుత్వం 2048 అంగన్వాడీ కేంద్రాలు మంజూరు చేసి కేవలం 18 పూర్తి చేసిందని అదే చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల కొరత లేకుండా చూడాలని, వినుకొండ నియోజకవర్గంలోని అన్ని అంగన్వాడీల్లో విద్యుత్ సదుపాయం కూడా తప్పనిసరిగా కల్పించాలన్నారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ సంస్థ డాన్ బాస్కో లెర్నింగ్ సెంటర్ ప్రోగ్రాం మేనేజర్ డి.వసంత కుమార్ అన్నారు. శుక్రవారం తాడేపల్లి యానాది కాలనీలో మున్సిపల్ కార్పొరేషన్ సానిటేషన్, డాన్ బాస్కో నవ జీవన్ బాల భవన్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకో వద్దన్నారు. మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వాడకంలో యువత ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పిల్లల గురించి తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రోజుకి ఒకగంట సేపు పిల్లలతో తల్లిదండ్రులు మాట్లాడాలన్నారు. సొల్యూషన్, గంజాయి సేవించే వారిని బాగుచేసుకునేందుకు పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని సంప్రదించవచ్చన్నారు. డాన్ భాస్కో లెర్నింగ్ సెంటర్ టీచర్స్ జె.ఆశ, ఎం.పావని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పార్శిల్ డెలివరీ పై అవగాహన

విశాలాంధ్ర - వినుకొండ : డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవంలో భాగంగా శుక్రవారం వినుకొండ డిపోమేనేజర్ నాగేశ్వరావు, విను కొండ ఎస్టీపీ జి. ధనమ్మ, ఏటీఎం (సీ)/గుంటూరు&పల్నాడు జిల్లా డి.ఆదినారాయణ మీటింగ్ నిర్వహించారు. వినుకొండ డిపో సిబ్బంది ప్రతి ఒక్కరు తప్పని సరిగా మూడు డోర్ డెలివరీలు పార్శిల్స్ తమ బంధు వులకు, స్నేహితులకు బుకింగ్ చెయ్యాలని సిబ్బందికి తెలిపారు. వినుకొండ ఆఫీస్ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది అందరు కలిసి డోర్ డెలివరీ చెయ్యాలని వివరించారు. ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు పి.సాంబశివరావు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉండాలి : విడదల రజిని

విశాలాంధ్ర-చిలకలూరిపేట : వైసీపీ పార్టీ నాయకులు, కార్య కర్తలు ప్రజలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి విడదల రజిని తెలిపారు. పార్టీ పల్నాడు జిల్లా యువజన విభాగం నూతన అధ్య క్షుడిగా నియమితులైన కందుల శ్రీకాంత్ శుక్ర వారం మాజీ మంత్రి విడ దల రజినిని ఆమె నివాస ంలో కలిశారు. ఆయనతో పాటు దాదాపు 200 మం దికి పైగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు. వీరిని ఉద్దేశి ంచి విడదల రజిని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడా ల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ప్రజలకు అర్ధ గోలు హామీలు ఇచ్చి మాట తప్పారని దుయ్యబట్టారు. ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజ మెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే వరకు పార్టీ పోరాడుతూనే ఉంటుందన్నారు. నూతన అధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తామని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సయ్యద్ షరీఫ్‌కు శ్రద్ధాంజలి

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి పురపాలక సంఘంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ అకాల మృతి చెందిన సయ్యద్ షరీఫ్‌కు మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ కమిషనర్ బి.శేషన్నలు శ్రద్ధాంజలి ఘటించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, హెల్త్ ఆఫీసర్ డా.కారుమూరు హెలెన్ నిర్మల, మున్సిపల్ మేనేజర్ చండి దేవసేన, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది సయ్యద్ షరీఫ్‌కు సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వాహనం ఢీకొని మహిళ పరిస్థితి విషమం

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల కేంద్రంలోని ఆనందపేట సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని కంచర్ల లిల్లీ హెలెన్ తలకు దెబ్బ తగిలిచెవుల నుంచి రక్తస్రావం అవుతున్నట్లు వారి బంధువులు తెలిపారు. ఢీకొట్టిన వాహనాన్ని పెదకూరపాడు పోలీస్ స్టేషన్ లో అప్పజెప్పి ప్రమాదానికి గురైన లిల్లీ హెలెన్‌ను జీజీహెచ్‌కు తరలించినట్లు వారి బంధువులు తెలిపారు. ప్రమాదానికి కారకుడైన వ్యక్తి పోలీసుల అదుపునుంచి వెళ్లినట్లు బంధువులు ఆరోపించారు.

22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-అమరావతి : ఈ నెల 22న మధ్యాహ్నం 2.15 గంటలకు అమరావతి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతున్నట్లు ఎంపీడీఓ టి.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు మేకల హనుమంతరావు అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశంలో మండల పరిధిలోని ఎంపీటీసీలు, ఆయా గ్రామ సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉన్నతాధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

వికలాంగు పింఛన్ల తనిఖీ

విశాలాంధ్ర-నూజెండ్ల : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మృత్యుంజయపురం, చింతలచెరువు, జంగాలపల్లి, తలార్లపల్లి, ఉప్పలపాడు, కంభంపాడు, రవ్వారం గ్రామాలలో మంచానికే పరిమితమైన, వివిధ రకాల వికలాంగు పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ శుక్రవారం తనిఖీ చేయడం జరిగిం దని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పావులూరి ఉమా దేవి తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లా డుతూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం నివేదికలను తయారుచేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ వరుణ్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రోశయ్య, పుష్పేంద్ర కుమార్, డిజిటల్ అసిస్టెంట్ అమిత్ మోహన్ దాస్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

20 నుంచి జీ తెలుగులో 'మంతెన' ఆరోగ్యమే మహాయోగం

విశాలాంధ్ర-గుంటూరు: ఈనెల 20వ తేదీ నుంచి ప్రముఖ ఆరోగ్య సలహాదారులు మంతెన సత్యనారాయణ రాజు అందించే ఆరోగ్యమే మహాయోగం కార్యక్రమం జీ తెలుగులో పునః ప్రారంభిస్తున్నట్లు సంస్థ ప్రతి నిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య సలహాలు, సూచనలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకునే సమగ్ర సమాచారం అందించే కార్యక్రమంగా పేర్కొ న్నారు. 1278 ఎపిసోడ్స్ సుదీర్ఘకాలంపాటు ప్రసార మైన ఆరోగ్యమే మహాయోగం అశేష ప్రేక్షకాదరణ అందుకుందన్నారు. మరింత సమగ్ర సమాచారం, సరికొత్త సందేహాలు, సలహాలతో ఆరోగ్యమే మహా యోగం కార్యక్రమం ఈనెల 20వ తేదీ నుంచి సోమ వారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 8:30 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అన్న పూర్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించనుండగా ప్రముఖ ఆరోగ్య సలహా దారులు మంతెన సత్యనారాయణ రాజు ప్రేక్షకుల సమస్యలు, సందేహాలకు సరైన సలహాలు అందిస్తారన్నారు. సంపూర్ణ ఆరోగ్యకరమైన జీవితానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకో వాలో, శారీరక, మానసిక ఆరోగ్యానికి జీవన శైలిలో చేసుకోదగిన సూచనలు ఈ కార్యక్రమం ద్వారా పొందవచ్చున్నారు. జీ తెలుగు అందిస్తున్న ఆరోగ్యమే మహా యోగం కార్యక్రమాన్ని తప్పక చూడాలన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పేరుతో పచ్చదనానికి పాతరేస్తున్న ఇరిగేషన్ శాఖ

– పెద్ద పెద్ద వృక్షాలు నరికి సొమ్ము చేసుకుంటున్నా వైనం

విశాలాంధ్ర-మేడి కొండూరు: పచ్చ దనం పెంపొందించే దుకు ప్రభు త్వం కోట్లాది రూపాయలకు ఖర్చు చేసి రోడ్ల ఇరువైపులా, కాలువ గట్లపై ప్రభుత్వ స్థలాలలో మొక్కల పెంపకం చేపడుతుంటే నీటిపారుదల శాఖ అధికారుల పనితీరు దీనికి విరుద్ధంగా ఉంది. నరుకుళ్ళ పాడు మేజర్ కాలువపై సిరిపురం సమీపంలో రైతులు కాలువగట్లపై పెంచుకుంటున్న 20 సంవత్సరాల పైబడిన పెద్ద పెద్ద వృక్షాలను శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ పేరుతో నీటి పారు దల శాఖ అధికారులు నరికి ట్రాక్టర్ల పై తరలించి సొమ్ము చేసు కుంటున్నట్లు సిరిపురం గ్రామ రైతు వెలనాటి శ్రీనివాస్ ఆరోపించారు. కాలువ గట్లపై జంగిల్ క్లియరెన్స్ అంటే నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలతో పాటు కాలువ గట్లపై రాకపోకలకు అడ్డంగా ఉండే ముళ్ళ చెట్లను తొలగించాల్సి ఉంటుంది. దీనికి విరుద్ధంగా నీటిపారుదల శాఖ అధికారులు కాలువ గట్లపై రైతులు నీడ కోసం పెంచుకున్న పెద్ద పెద్ద వృక్షాలు మాత్రమే నరికి అడితీ లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరుపై రైతు వెలనాటి శ్రీనివాస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

పాటిబండ్ల హైస్కూల్‌ను సందర్శించిన ఎంఈఓ

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండల పరిధిలోని పాటి బండ్ల హైస్కూల్‌ను పెదకూరపాడు మండల విద్యాశాఖ అధికారి తాడిశెట్టి సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. పదవ తరగతి 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఏ విధంగా అమలు జరుగుతుంది, పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులు బాగా కష్ట పడి చదవాలని, పాఠశాలకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సిస్టర్ వై.విజయ రాణి విద్యాశాఖ అధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాసు నాగభూషణ్ రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో 'వెల్నెస్ క్లినిక్ సెంటర్' ప్రారంభం

– ఎమ్మెల్యే నజీర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు 'వెల్నెస్ క్లినిక్' సెంటర్లను తీసుకొచ్చినట్లు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జిజిహెచ్) ఆసుపత్రి లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'వెల్నెస్ క్లినిక్' సెంటర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, హాస్పిటల్ డెవలప్ మెంట్ సొసైటీ (హెచ్‌డీఎస్)మెంబర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, కార్పొరేటర్ సమతల సమక్షంలో నజీర్ అహ్మద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ నేటి ఆధునిక జీవనశైలిలోని మార్పులు..ఆహారపు అలవాట్లు..వయసుతో పని లేకుండా అనేకమంది బీపీ, షుగర్ వంటి వ్యాధులకు లోనవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో వెల్నెస్ క్లినిక్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం జరిగి ందన్నారు. ఎటువంటి జబ్బు లేనప్పటికీ రాబోయే జబ్బులకు ముందుగానే అవసరమైన పరీక్షలు..డాక్టర్ సల హాలు.. జీవిత విధానాలు మార్చుకునే అవగాహన కార్యక్రమాలు ఈ వెల్నెస్ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. హెచ్‌డీఎస్ మెంబర్ డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వెల్నెస్ క్లినిక్ సెంటర్‌ను ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ చేతుల మీదుగా జీజీహెచ్‌లోని ఓపీ నెంబర్ 3లో ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ ఉంటేనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించగలమన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వెల్నెస్ క్లినిక్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. బొంబాయి వంటి పెద్ద పెద్ద నగరాల్లో 'రివైవ్' అనే హెల్త్ క్లినిక్స్ ఉన్నాయని, అవి చాలా ఖరీదైన సెంటర్స్ అని, అయితే ఇప్పుడా సెంటర్స్ సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ప్రతి వ్యక్తికి ప్రభుత్వ ఫలాలు అందించాలన్న లక్ష్యంతోనే వెల్నెస్ క్లినిక్ సెంటర్లను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని, ప్రభుత్వం కల్పించిన ఈ వెల్నెస్ క్లినిక్ ను సద్వినియోగం తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆయన కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ ఎస్‌బిఎం విభాగం ఆధ్వర్యంలో నడిచే ప్రివెంటివ్ యాస్పెక్ట్ ఉన్న ప్రాజెక్టు ఈ వెల్నెస్ సెంటర్ అని అన్నారు. జీజీహెచ్‌లోని 3వ నెంబరు ఓపిలో ప్రతి సోమవారం, బుధవారం డాక్టర్లు, నర్సులు అందుబాటులో ఉంటారని, బీపీ, షుగర్, ఎత్తు, బరువు చూడటం చూస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటిక దురాక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర-మంగళగిరి :స్మశాన వాటిక ఆక్రమణలను వెంటనే తొలగించాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్, ప్రముఖ న్యాయ వాది చిలువూరు నాగరాజు మాదిగ విజ్ఞప్తి చేశారు. చిలువూరు నాగరాజు మాదిగ మాట్లాడుతూ చిలువూరు మాదిగ పల్లెకు సంబంధించిన స్మశానవాటిక స్థలం దురాక్రమణకు గురైందని నిర్దిష్ట రహదారి ఏర్పాటు చేసి మాదిగ జాతి ఆత్మ గౌరవాన్ని కాపాడాలని కోరారు. ఇటీవల కాలంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన స్థానిక టీడీపీ నాయకురాలు యేళ్ళ జయలక్ష్మి ఆమె కుమారుడు, మద్దతుదారులు స్మశాన వాటిక స్థలమును ఆక్రమణ చేసుకొని అడిగిన వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యేళ్ళ జయ లక్ష్మి ఆమె కుమారుడు మద్దతుదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. స్మశాన వాటికను ఆనుకొని పక్కనే సుమారు మూడు ఎకరాల భూమిని అగ్ర కులాలు దశాబ్దకాలం క్రితం దురాక్రమణ చేశారని, సదరు దురాక్రమణలు వెంటనే తొలగించి, క్రమ బద్ధీకరించి ఆ స్థలాన్ని స్మశాన వాటికకు విస్తరించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. మాజీ జడ్పీ టీసీ యేళ్ళ జయలక్ష్మి, వారి బృందంపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. సాను కూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే దుగ్గిరాల తహశీల్దార్‌కు సమస్యను పరిష్కరించాలని ఉత్తర్వులు జారీ చేస్తూ తమ సమక్షంలోనే సదరు అర్జీపై సంతకం చేశారని ఆయన తెలిపారు. ఏటుకూరి విజయ్ కుమార్, కట్టెపోగు బాబురావు, మురికిపూడి కన్నా, కొమరాల శ్రీనివాసరావు మాదిగ, నవీన్ మాదిగ, కొమ్ము ఆనంద్‌మాదిగ, చిలువూరు హనుమంతరావు మాదిగ, కనపాల బాజీ మాదిగ పాల్గొన్నారు.

రేపు లింగంగుంట్లలో 'ఉచిత కంటి, బ్రెయిన్' క్యాంప్



విశాలాంధ్ర-గుంటూరువైద్యం : లలితా హాస్పిటల్ అధినేత, సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, సీనియర్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ విజయ బాబుల ఆధ్వర్యంలో ఈ నెల 19న పెద కూరపాడు మండలం, లింగంగుంట్ల గ్రామ ంలో 'ఉచిత కంటి, బ్రెయిన్' వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లలితా హాస్పి టల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెదడు, నరాల సమస్యలు, పక్షవాతం, తలనొప్పి, తూలుడు, ఫిట్స్, వృద్ధులు, చిన్న వయస్సులో వచ్చే నరాల సమస్యలు, స్పాండి లైటిస్, న్యూరోపతి, నడుంనొప్పి, వెన్నెముక సమస్యలు ఉన్నవారికి అలాగే కంటి శుక్లం ఉన్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఆసుపత్రిలో ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేయబడతాయన్నారు. ఉచిత బీపీ చెకప్, బ్లడ్ షుగర్, ఈసీజీ, కంటి చెకప్, న్యూరాలజిస్ట్ కన్సల్టేషన్ చూడబడతాయని వెల్లడించారు.

CHANGE OF SURNAME

I, SANTHA KUMARI ANGADI (Old Name), W/o. Angadi Prabhakara Rao, Resident of Door No.134-15-1437, F.No.201, Gayatri Heights, Sriram Nagar 10th Line, Inner Ring Road, Gorantla, Guntur, Guntur District - 522034, Andhra Pradesh. I have changed my surname as BELLAMKONDA SANTHA KUMARI (New Name) W/o. Angadi Prabhakara Rao. Hereafter my surname is known as BELLAMKONDA SANTHA KUMARI (New Name) W/o. Angadi Prabhakara Rao.

CHANGE OF NAME

I, ANGADI VIJAY HASWITH (Old Name), S/o. Angadi Prabhakara Rao, Resident of Door No.134-15-1437, F.No.201, Gayatri Heights, Sriram Nagar 10th Line, Inner Ring Road, Gorantla, Guntur, Guntur District - 522034, Andhra Pradesh. I have changed my name as ANGADI VIJAY HASHWITH (New Name) S/o. Angadi Prabhakara Rao. Hereafter my name is known as ANGADI VIJAY HASHWITH (New Name) S/o. Angadi Prabhakara Rao.

3వ ఎడిషన్‌తో రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సమకాలీన హిప్-హాప్ బీట్స్‌తో బాలీవుడ్లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన గీతాలను మిశ్రమం చేసిన తమ మూడవ ఎడిషన్ కోసం సీగ్రమ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మళ్లీ వచ్చింది. ఈ సీజన్ ను మిర్చి తయారు చేస్తుండటంతో, ఈ లీనమయ్యే మ్యూజిక్ ఫెస్టివల్ ఈ నెల 14న ముంబైలో జరిగిన ప్రత్యేక మీడియాప్రివ్యూలో రాబోతున్న శ్రేణిని ప్రదర్శించింది. ఈ విలక్షణమైన సాంస్కృతిక కలయిక సంప్రదాయబద్ధమైన, ఆధునిక భారతదేశపు సంగీతం యొక్క కూడలిని పునర్నిర్వచించడం కొనసాగించింది. బ్రాండ్ యొక్క 'లివింగ్ ఇట్ లార్జ్ లీ' సిద్ధాంతానికి చిహ్నంగా నిలిచింది. ఈ ఫెస్టివల్ హైదరాబాద్, ముంబయి, గురుగ్రామ్, గౌహతి నాలుగు ప్రధాన యువ కేంద్రాల్లో ప్రయాణించింది.

రియల్‌మీ 14 ప్రో సిరీస్ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ: ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ రియల్‌మీ తాజాగా ఏఐఓటి పోర్ట్‌ఫోలియోని ఎక్కడా చూడని ఉత్పత్తులలో ప్రవేశపెట్టింది. అత్యంత మెరుగైన రియల్‌మీ 14 ప్రో సిరీస్ 5 జి, రియల్‌మీ బడ్స్ వైర్ లెస్ 5ని అందిస్తుంది. రియల్‌మీ 14 సిరీస్ 5 జిలో రియల్‌మీ 14 ప్రో 5 జి, రియల్ మీ 14 ప్రో ప్లస్ 5 జి అనే రెండు రకాలు అందుబాటులో ఉన్నాయి. రెండు ఫోన్‌లు ప్రఖ్యాత డానిష్ డిజైన్ స్టూడియో, వాలూర్ డిజైనర్ల సహకారంతో చాలా సూక్ష్మంగా రూపొందాయి. ఇది ప్రపంచంలోని మొట్టమొదటి చల్లని-సెన్సిటివ్ రంగు-మారుతున్న స్మార్ట్‌ఫోన్ల ప్రారంభానికి గుర్తుగా ఉంది.

రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలి

– ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఏపీ ఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక నెహ్రూనగర్‌లో వేంచేసియున్న శ్రీ రంగనాయకి శ్రీగోదాదేవి సాహిత శ్రీ రంగనాథ స్వామికి ఆయిశెట్టి సీతా రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి ట్రస్ట్ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ)చైర్మన్ దేగల ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేగల ప్రభాకర్ స్వామివారిని దర్శిం చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఆ రంగనాథస్వామి వారి ఆశీస్సు లతో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. యర్రగోపు నాగేశ్వరరావు, ఆయిశెట్టి శ్రీను, బొక్కిసం శివరామ్, రాగం సదా శివరావు, మేకల బాబు రావు, వినోద్, యర్రగోపు వాసు, కుమార్, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం తాడేపల్లి గ్రామానికి చెందిన **జె.అనితారావు, భర్త జోగేశ్వరరావు** అను నేను మా స్వగృహమునుండి నాయొక్క పాస్‌పోర్టు నెం. **G5526796** తీసుకొని జిరాక్స్ తీయించు నిమిత్తమై జిరాక్స్ సెంటరుకు వెళుతుండగా దారిలో ఎక్కడో జారిపడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

అడ్రస్ : జె.అనితారావు, భర్త జోగేశ్వరరావు, రిటైర్డ్ డిఎస్‌పి, తాడేపల్లి, గుంటూరు జిల్లా. సెల్ నెం. 7416579999.

ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది

కొమ్మారెడ్డి హరనాథ్ రెడ్డి, తండ్రి వెంకటరెడ్డి అను నేను పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం కండ్లకుంట గ్రామ నివాసినై యున్నాను. అయితే నాకు సంబంధించిన నెం: **M4680586**గా గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ ఈ నెల **10వ తేదీన** మా స్వగ్రామమైన కండ్లకుంట నుండి వెల్దుర్తికి బైక్‌పై వెళు తుండగా కనిపించకుండా పోయినది. ఎంత వెతికినను కనబడటం లేదు. ఎవరికైనా దొరికిన యెడల సెల్ నెం: **9885040757**కు తెలియజేయగలరు.

పింఛన్‌దారుల తనిఖీ

విశాలాంధ్ర-దుర్గి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంచానికే పరిమితమై రూ.15 వేలు పెన్షన్ తీసుకునే రోగుల స్థితిని తెలుసుకునేందుకు మండలంలోని దుర్గి, ముటుకూరు గ్రామాల్లో ఎంపీడీఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు.

CHANGE OF NAME

I, MEDIKONDURU APARNA D/o. MEDIKONDURU RAJASEKHAR RAO (Old Name), Resident of Door No:4-154, Mutluru Village, Vatticherukuru Mandal, Guntur District - 522212, Andhra Pradesh. I have changed my name as MEDIKONDURU APARNA D/o. MEDIKONDURU RAJASEKHARA RAO (New Name). Hereafter my name is known as MEDIKONDURU APARNA D/o. MEDIKONDURU RAJASEKHARA RAO (New Name).

న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : రాష్ట్ర ప్రభుత్వ అప్రజా స్వామిక విధానాలపై జరుగుతున్న న్యాయ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు న్యాయవాదులు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలతో వేధిస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ న్యాయం పక్షాన నిలబడాలని.. చట్టపరంగా గొంతెత్తి నినదించాలని నిలదీసి నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. అందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందజేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఆయన ప్రకటించారు. పల్నాడు జిల్లా వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షులురాలుగా నియమితులైన ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ రోళ్ళ మాదవి శుక్రవారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరులోని ఆయన నివాసానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన న్యాయవాదులతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు. ఏపీ బార్ కౌన్సిల్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, వైసీపీ లీగల్ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్, గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, సోమసాని జాన్సీలక్ష్మి, కళ్ళం రమణ రెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, కోటి, శ్రీనివాసరెడ్డి, మెండి తోక శ్రీనివాసరావు, కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, కెవిస్టి సింగ్, గౌతమి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్లు, పార్టీ నేత గోళ్ళ శివశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్'లో స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలి

- నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల 3వ శనివారం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే కార్యక్రమాల్లో నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించి, సదరు కార్యక్రమాలకు ప్రొటోకాల్ మేరకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాల నిర్వహణపై నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి దేశంలో అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడానికి 12 నెలలకు 12 థీమ్‌లతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని రూపొం దించారన్నారు. అందులో భాగంగా ఈ నెల 18న న్యూ ఇయర్-క్లీన్ స్టార్ట్ థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ సిగ్నల్ జంక్షన్ వరకు సుమారు 2 వేల మందితో స్వచ్ఛత ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేపడతామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాష, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ముస్లింలు రాజకీయంగా ఎదగాలి : ఎంపీ లావు

విశాలాంధ్ర-దాచేపల్లి: అటు దేశంలోను, ఇటు రాష్ట్రంలోను ముస్లింలు రాజకీయంగా మరింత ఎదగాల్సిన అవసరం ఉందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, టీటీడీ పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా ప్రజా సహకారంతో ఏళ్ళ తరబడి దాచేపల్లిలో నడుపుతున్న అరబ్బీ బాలికల పాఠశాలలో ఆలీం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ధృవపత్రాలు ఇచ్చే కార్యక్రమాన్ని శుక్రవారం గామాలపాడులోని మహమ్మదీయ మసీదులోఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చేతుల మీదుగా ఆ విద్యార్థుల తల్లిదండ్రులకు సర్టిఫికెట్లను ఇచ్చారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ ముస్లిం సోదరులు తమ పిల్లల చదువులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వారిని బాగా చదివించి మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకా లను ఉపయోగించుకోవాలని కోరారు. ఇటువంటి మంచి మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. సొంతంగా వ్యాపారాలు చేసుకోవడానికి, చిన్నతరహా పరిశ్రమలు పెట్టుకోవడానికి రాయితీలతో కూడిన 12 రకాల పథకాలు ఉన్నాయన్నారు. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని, రాజకీయంగా మరింత ఎదగాలని కోరారు. నగర పంచాయతీ కౌన్సిలర్ షేక్ షరీఫ్, ముగ్గు మిల్లు వ్యాపారి సయ్యద్ సైజ్జాన్, బంగారు నగల వ్యాపారి షేక్ జానీబాషతో పాటు కూటమి నాయ కులు, మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-మంగళగిరి : మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతరాష్ట్రీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీలు 6వ రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగాయి. నెల్లూరు వర్సెస్ ప్రకాశం జట్ల మధ్య జరిగినమ్యాచ్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ప్రకాశం జట్టు టాస్ గెలిచి నెల్లూరు జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించగా నెల్లూరు జట్టు నిర్ణిత 20 ఓవర్లలో 155 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 14.1 ఓవర్లలో 90 పరుగులు చేసి ఆల్ అవుట్ అవడంతో నెల్లూరు జట్టు 65 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 ఓవర్లలో 12 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసిన సాలుంకి అఖిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. చిత్తూరు వర్సెస్ తూర్పుగోదావరి మధ్య జరిగిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 9 వికెట్ల నష్టానికి గాను 138 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 19.5 ఓవర్లలో 131 పరుగులు చేసి ఆల్ అవుట్ అవ్వడంతో పరాజయం పాలైంది. టీవీ సాయి శ్రావణ్ 46 బంతుల్లో 56 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను గెలుచుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన ఇద్దరికీ పట్టణ తెలుగు యువత అధ్యక్షులు భోగి వినోద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కనికళ్ళ చిరంజీవి సహకారంతో ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈవెంట్ స్పాన్సర్లుగా సేల్, సక్కు, మార్కోరోస్, ఉషోదయ సంస్థలు వ్యవహరిస్తున్నాయి. ప్రీమియర్ లీగ్, సిజన్-3 పోటీలలో ప్రథమ బహు మతి కింద రూ.3 లక్షలు కొమ్మారెడ్డి కిరణ్, ద్వితీయ బహుమతి కింద రూ.2 లక్షలు కాట్రగడ్డ మధుసూధన్ రావు, తృతీయ బహుమతి కింద రూ.లక్ష నగదును పల్నాటి నాగేశ్వరరావు, అమ్మిరెడ్డి సాంబశివరావు సహకారంతో బహుమతులు ప్రధానం చేయనున్నారు. అలాగే మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రూ.50 వేలు బత్తుల హరి దాస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.25 వేలు కాసరనేని జస్వంత్, బెస్ట్ బౌలర్‌కు రూ.25 వేలు తాడిపత్రి అజయ్‌కుమార్, ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ఆఫ్‌దిమ్యాచ్ రూ.10 వేల నగదును భోగి వినోద్, కనికళ్ళ చిరంజీవి సహకారంతో నగదు బహుమతులు అందించనున్నారు.

నేడు జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్

విశాలాంధ్ర-నరసరావుపేట: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను పల్నాడు జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే జిల్లా అధికారు లను ఆదేశించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ-దివస్ కార్యక్రమంపై శుక్రవారం వెబెక్స్ ద్వారా అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీల్లో పరిశుభ్రమైన రోడ్లు, చెత్త రహిత పరిసరాలే లక్ష్యంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 'నూతన సంవత్సరం-పరిశుభ్ర ప్రారంభం' నినాదంతో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదే సమయంలో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు నోడల్ అధికారులను నియమించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

ఎరువులు దుకాణాల పై ఇంటర్నల్ స్క్వాడ్

- మూడు షాపులలో రూ. 9.52, 159 లక్షలు ఎరువుల అమ్మకాలు నిలిపివేతకు ఆదేశాలు

విశాలాంధ్ర ఏ కొండూరు: ఏ కొండూరు మండలం లోని ఎరువుల పురుగు మందుల దుకాణాలు పి ఇంటర్నల్ స్క్వాడ్ వ్యవసాయ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి రికార్డులు సక్రమంగా లేని మూడు షాపులు లో రూ.9,52,159ల ఎరువుల విక్రయాలను నిలిపివెయ్యాలని ఎరువుల దుకాణాల డీలర్లను ఆదేశించారు. ఇంటర్నల్ స్క్వాడ్ ఏడీఏ ఎం శ్రీనివాసరావు తిరువూరు మండల వ్యవసాయ అధికారి పి. పద్మ ఏ కొండూరు మండల వ్యవసాయ అధి కారి షేక్. టిప్పు సుల్తాన్ సిబ్బంది తో కలసి దాడులు నిర్వహించారు. దాడుల్లో చీమలపాడులోని సాయి ఎంటర్ ప్రైజెస్‌లో రూ.3,54,639ల ఎరువులను అలానే ఏ కొండూరులోని శ్రీ లక్ష్మి గణపతి ఎంటర్ ప్రైజెస్‌లో రూ.1,48,107,లఎరువులను కభం పాడులోని శ్రీ లక్ష్మి హనుమాన్ ట్రేడర్స్‌లో రూ.4,49,359ల ఎరువుల అమ్మకాలను నిలిపివేయాలి అని దుకాణాల యజమానులను ఆదేశించారు. ఎరువుల దుకాణాల్లో భౌతిక ఎరువుల నిల్వ, ఈ పాస్‌లో నిల్వాలను తనికి చేశారు ఎరువుల అమ్మకాలు సంబంధించి సోర్సు సర్టిఫికెట్ ఓఫారం ఎరువులు, భయో స్టిమిలెంట్‌కు సంబంధించి సోర్సు సర్టిఫికెట్ డాక్యుమెంట్స్ చూపించక పోవడం వల్ల పైన పేర్కొన్న మూడు దుకాణాల్లో ఎరువులు అమ్మకాలు నిలిపి వేసి నట్లు ఏడీఏ శ్రీనివాస రావు తెలి పారు. డీలర్లు తప్పని సరిగా ఫీజికల్ స్టాక్‌లు వేరియేషన్ లేకుండా చూసుకోవాలని ఎ రోజు అమ్మకాలు ఆరోజు ఈ పాస్ లో తప్పని సరిగా నమోదు చెయ్యాలి అని ఆదేశించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు కు బిల్లు ఇచ్చి రైతులతో సంతకం లేదా వేలిముద్ర తీసుకోవాలని ఆదేశించారు.

భారత్ ఎన్‌సిఎపి క్రాష్ టెస్ట్‌లో స్కోడా కైలాక్ కు 5-స్టార్ రేటింగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): స్కోడా ఆటో ఇండియా మొదటి సబ్-4 మీటర్ల ఎస్‌యువి కైలాక్, భారత్ ఎన్‌సిఎపి (న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్)లో ప్రతిష్టాత్మకమైన 5-స్టార్ భద్రతా రేటింగ్‌ను సాధించింది. దీనితో భారత్ ఎన్‌సిఎపి పరీక్షల్లో పాల్గొన్న మొట్టమొదటి స్కోడా వాహనంగా కైలాక్ నిలిచి, కుషాక్, స్లావియా నెలకొల్పిన భద్రతా శ్రేష్ఠత బ్రాండ్ వారసత్వాన్ని కొనసాగిస్తోంది. స్కోడా ఆటో ఇండియా 2.0 కార్లు రెండూ పెద్దలు, పిల్లల ప్రయాణికుల రక్షణ కోసం సంబంధిత గ్లోబల్ ఎన్‌సిఎపి క్రాష్ పరీక్షల్లో 5-స్టార్ భద్రతా రేటింగ్‌లను సాధించాయి. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా మాట్లాడుతూ, సమగ్ర భద్రతా వ్యవస్థలతో వస్తున్న కైలాక్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో సహా విస్తృత శ్రేణి యాక్టివ్, పాసివ్ భద్రతా లక్షణాలు ప్రామాణికంగా ఉన్నాయని తెలిపారు. హాట్-స్టాంప్డ్ స్టీల్ వాడకం, రీడోన్ క్రాష్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో కైలాక్‌లో సాధ్యమైనంత ఉత్తమమైన భద్రతను నిర్ధారిస్తుందని పేర్కొన్నారు.

కొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లతో సామ్‌సంగ్ బెస్పోక్ ఏఐ లాండ్రీ పోర్ట్‌ఫోలియో విస్తరణ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ సరికొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. తెలివైన, సమర్థవంతమైన లాండ్రీ సొల్యూషన్స్‌లో కొత్త ప్రమాణాలను నిర్దేశించిన 12 కేజీ మోడళ్ల అద్భుతమైన విజయం, కొత్త 9 కేజీ వాషింగ్ మెషీన్ శ్రేణి అదే శక్తివంతమైన పనితీరు, అధునాతన లక్షణాలను కాంపాక్ట్ పరి మాణంలో అందిస్తుంది. తాజా 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషి ంగ్ మెషీన్లు పెద్ద లోడ్‌లను నిర్వహించడానికి సరైన పరి మాణంలో ఉన్నాయి. బట్టలు, బెడ్‌షీట్లు, తువ్వాళ్లు వంటి రోజువారీ లాండ్రీకి సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తాయి.

ఫిబ్రవరి 17 నుంచి తిరుపతిలో అంతర్జాతీయ దేవాలయాల సదస్సు, ఎక్స్‌పో

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అంతర్జాతీయ దేవాలయాల సదస్సు, ఎక్స్‌పో (ఐటీసీఎక్స్) రెండవ ఎడిషన్‌తో మహోన్నతంగా తిరిగి వస్తోంది. 2023లో దాని ప్రారంభ అధ్యాయం యొక్క అద్భుతమైన విజయం, విస్తృత ప్రశంసలను సంపాదించిన నేపథ్యంలో, ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మద్దతు కూడా లభించింది. ఫిబ్రవరి 17 నుండి 19 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని పరమ పవిత్రమైన ఆలయ నగరమైన తిరుపతిలో ఇది జరగనుంది. టెంపుల్ కనెక్ట్ (ఇండియా) ద్వారా అభివృద్ధి చేయబడిన ఐటీసీఎక్స్, ప్రపంచవ్యాప్తంగా దేవాలయాల సమగ్ర నిర్వహణకు ప్రత్యేకంగా అంకితమైన ప్రపంచంలోని మొట్టమొదటి ప్రతిష్ఠాత్మక వేదికగా నిలుస్తుంది. ఇది ఆలయ ఆర్థిక వ్యవస్థ యొక్క పరిపాలన, కార్యకలాపాలు, పురోగతిలో శ్రేష్ఠతను లక్ష్యంగా పెట్టుకుంది.

పుస్తకాల కొనుగోళ్ల బకాయిల విడుదలపై హర్షం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గ్రంథాలయ సంస్థలు 2021-22 సంవత్సరాలకు గాను కొనుగోలు చేసిన పుస్తకాలకు గత ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిల విడుదలకు అరసం, రచయితలు, ప్రచురణకర్తలు చేసిన విజ్ఞప్తులకు స్పందించి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కడప జిల్లాల బకాయిలను ప్రభుత్వం ఈ నెల 13వ తేదీ విడుదల చేయటం హర్షణీయమనీ అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వానికి అరసం ధన్యవాదాలు తెలియజేస్తోందన్నారు. ఇంకా అనంతపురం, నెల్లూరు, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు కొనుగోలు చేసిన బకాయిలను కూడా చెల్లించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నగరంలో వార్డు అభివృద్ధి కమిటీలు ఏర్పాటు

- నగర కమిషనర్‌తో పలువురు సీనియర్ సిటిజన్స్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరాభివృద్ధికి సీనియర్ సిటిజన్స్ సూచనలు సలహాలు ఎంతో దోహదపడతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమా వేశ మందిరంలో సీనియర్ సిటిజన్స్‌తో ప్రత్యేక సమా వేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ వివిధ రంగాలలో ఎంతో అనుభవం సాధించి ఉంటారని, అటువంటి వారి సూచనలు సలహాలు నగరా భివృద్ధికి ఎంతగానో అవసరమన్నారు. ప్రధానంగా పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పార్కులు, డివైడర్ల నిర్వహణ వంటి అంశాలపై నిర్మాణాత్మకమైన సూచనలు అందించాలని కోరారు. సీనియర్ సిటిజన్స్, జీఎంసీ అధికారులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేస్తామని, గ్రూప్‌లో తమ అభిప్రాయాల్ని పోస్ట్ చేయవచ్చునని తెలిపారు. రాబోవు కాలంలో సీనియర్ సిటిజన్స్ సూచనల ద్వారా నగరా భివృద్ధికి, నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపా యాలు కల్పించుటకు కృషి చేస్తామన్నారు. అలాగే రోడ్లపై ర్యాంపులు ఆక్రమణలను లేకుండా చూడాలని, అనధికారిక ఫుడ్ స్టాల్స్ తొలగించి నగరంలో ప్రాంతాల వారీగా ఫుడ్ కోర్ట్‌లు పెట్టాలని, ప్రతి వార్డులో సీనియర్ సిటిజన్స్‌కు కమ్యూనిటీ హాళ్ళు నిర్మాణం, ఉచిత మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్ సిహెచ్ శ్రీనివాసరావు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీపీ రాంబాబు, సీఎంఒహెచ్ డాక్టర్ అమృతం, పీఓ రామారావు, ఏడీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రామికుల్ని లొంగదీసుకునే కార్పొరేట్ల కుట్ర



విశాలాంధ్ర- గుంటూరు వైద్యం : వారానికి 90 గంటలు పని గంటలు ఉండాలంటూ ఎల్ అండ్ టీ అధినేత ఎస్ఎన్ సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమైనవని, కృత్రిమ మేధను బూచిగా చూపించి ఉద్యోగ, శ్రామికుల్ని లొంగదీసుకునేందుకు కార్పొరేట్లు ప్రారంభించిన కుట్ర అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో శివ రామిరెడ్డి మాట్లాడారు. గతంలో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వారానికి 70 గంటలు పని చేయా లని ప్రకటించి ఈ కుట్రకు నాందిపలికారన్నారు. కార్మికుల రక్త మాంసాలతో కార్పొరేట్లకు లాభాలను పండి వడ్డించే దుర్మార్గ చర్య అని, 8 గంటల పని హక్కుని పోరాడి సాధించు కున్న కార్మికవర్గం సమైక్యంగా ఈ ప్రయత్నాల్ని ఎదిరించాలన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

- ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రస్తుత కూటమి ప్రభుత్వం 2024 సాధారణ ఎన్నికల ప్రచార సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని ఎస్టీయు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వర రావు, డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయు భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా గత ప్రభుత్వం ఈ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు వారి జీతాలు మినహా మరి ఏ ఇతర ఆర్థిక పరమైన లబ్ది చేకూర్చాలేదని అన్నారు. సరెండర్ లీవులు, డి.ఎ అరియర్స్, పీఆర్‌సీ బకాయిలు, రెండు సంవత్సరాల నుంచి ఏపీజీఎల్ఐ పాలసీలు మెచ్యూర్ అయినప్పటికీ వాటి చెల్లింపులు మరిచారని ఆరోపించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మొత్తం బకాయిలు 32 వేల కోట్లు ఉన్నాయన్నారు. సంక్రాంతికి కేవలం 10 శాతం మాత్రమే చెల్లించారని మిగిలిన 90 శాతం సంగతి ఏంటని ప్రశ్నించారు. 12వ వేతన సవ రణ సంఘం కమిషన్ ఏర్పాటు ప్రక్రియ ఇంకా మొదలే పెట్టలేదని ఇప్పటికే 19 నెలలు ఆలస్యమైందని వెంటనే ప్రభుత్వం పీ ఆర్ సి కమిటీ చైర్మన్ నియమించా లని, ఈలోపు (ఐ.ఆర్) మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు పూర్తి అవుతోందని ఇప్పటికీ ఎన్నికల హామీలైన పీఆర్‌సి, డీఏ బకాయిల చెల్లింపు, 12వ పీఆర్సీ అంశాల పై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను చర్చలకే ఆహ్వానిం చడం లేదన్నారు. గత ప్రభుత్వం వలే ప్రస్తుత ప్రభుత్వం కూడా బడ్జెట్ పేరు చెప్పి ఉద్యోగ ఉపాధ్యాయులకు అన్యా యం చేయొద్దని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాట్లు మేనేజ్మెంట్ వారిగానే చేయాలని కోరారు. ఎస్టీయూ కార్యదర్శి వినుకొండ అక్కయ్య పివిభీష్మ రావు, పల్నాడు జిల్లా మైనార్టీ నాయకులు షేక్ నాగూర్‌వలి, జిల్లా మహిళా కన్వీనర్ ఎమ్ శారద, పట్టణ అధ్యక్షులు మేకల కోటేశ్వరరావు పట్టణ ప్రధాన కార్యదర్శి వడ్లన జయ ప్రకాష్, చిలకలూరిపేట మండల అధ్యక్షులు బొంత రవి, ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, నాదెండ్ల మండల అధ్యక్షులు మక్బూల్ బాషా, ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, యడ్లపాడు మండల అధ్యక్షులు జి కోటేశ్వ రరావు, ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్, సీనియర్ నాయకులు చావలి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేపై అధికారులతో సమావేశం

జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టరు సూరజ్ ధనుంజయ గనొరె ఆధ్వర్యంలో రిసర్వేకు సంబంధించిన అవగాహన ప్రోగ్రాంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తహశిల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహశిల్దార్లు, మండల సర్వే యర్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రతి మండలంలో ఒక గ్రామమును పైలెట్ గ్రామముగా తీసుకొని దానికి సంబంధించి గ్రామ సరిహద్దును పక్క గ్రామము యొక్క గ్రామ అధికారి, గ్రామ సర్వేయర్ తో కలిసి గ్రామ సరిహద్దును ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్ధారించా లని, తదుపరి గ్రామంలో ఖండములుగా విభజించి (సుమారు 200 ఎకరం నుండి 250 ఎకరాల వరకు) అందులో ప్రభుత్వ భూములను గుర్తించి వాటి హద్దులు నిర్ణయించి తదుపరి రైతులు సంబంధించి పట్టా భూములను సర్వే చేయాలని జెసి ఆదేశించారు. ఆ గ్రామము లో గ్రామసభ ర్యాలీ నిర్వ హించి వారికి రీ సర్వే యొక్క ప్రాధా న్యతను వివరించి సర్వే చేయాలన్నారు. ఆ భూములకు సంబంధించి రైతులకు నోటీస్ ద్వారా తెలియజేసి వారి సమక్షంలో వారు చూపించిన హద్దుల ప్రకారము కొలతలు తీసుకొని వాటి విస్తీర్ణము లెక్కించి వారికి 9(2) నోటీసు ద్వారా తెలియపరచి వారికి వచ్చిన విస్తీర్ణంలో ఏవైనా తేడాలు ఉంటే వాటిని ఆపిల్ స్వీకరించి వాటిని మొబైల్ మెసేజ్ ద్వారా విచారించి వారు చేసుకున్న అప్పీల్ ను పరిష్కారం చేయాలన్నారు. తదుపరి గ్రామాలకు సంబంధించి డ్రాఫ్ ల్యాండ్ రిజిస్టర్ తయారుచేసి పిదప గ్రామ సభ పెట్టి గ్రామ సభలో డీఎల్ఆర్ చదివి వినిపించి వాటిపై ఏమైనా అభ్యంతరములు ఉంటే అవి స్వీకరించి వాటిని పరిష్కరించి ఫైనల్ ల్యాండ్ రిజిస్టర్ తయారుచేసి తదుపరి ఆ గ్రామమునకు సంబంధించి 13 నోటిఫికేషన్ ప్రచురించకమైనదని తెలియజేసేదరు. ఈ ప్రక్రియ భాగంగా రైతులకు సంబంధించిన భూములను జనవరి మాసం 20వ తేదీన ప్రారంభించవలసిందిగా ఆదేశించి ఉన్నారు.

నియోజకవర్గానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర-పెదకూరపాడు : కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఆరునెలల్లోనే పెదకూరపాడు నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకొచ్చామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 32 పనులకు గాను మొత్తం రూ.37.55 కోట్లు నిధులను ప్రభుత్వం నుంచి మంజూరు చేసేలా కృషి చేశారు. అమరావతి మండలంలో 9 పనులకు గాను రూ.11.10 కోట్లు, పెదకూరపాడు మండలంలో 6 పనులకు రూ.4 కోట్లు, క్రోసూరు మండలంలో 7 పనులకు రూ.15.20 కోట్లు, బెల్లం కొండ మండలంలో 5 పనులకు రూ.4.90 కోట్లు, అచ్చంపేట మండలంలో 5 పను లకు రూ.2.35 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ నియో జక వర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే నియో జక వర్గానికి భారీగా నిధులు తెచ్చామన్నారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. నియోజకవర్గానికి అధికంగా నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గానికి నిధులను తెచ్చి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-తెనాలి : నాజరుపేటలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. బి.శేషన్న మాట్లాడుతూ దోమల వలన అనేక రకాల వ్యాధులు వస్తాయని, దోమల పెరుగుదలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఇండ్లలో వుండే ఖాళీ పాత్రలు, టైర్లు, రోలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు హితవు పలికారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం వలన దోమలను నివారించవచ్చని చెప్పారు. అందరూ దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్ర మంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కారుమూరు హెలెన్ నిర్మల, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, అక్కమ్మ, వాత్సల్య, శంషాద్ బేగం, ఆశా కార్యకర్తలు, రిసోర్స్ పర్సన్ శివజ్యోతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకున్నాం : జీవీ

విశాలాంధ్ర-వినుకొండ : విశాఖ ఉక్కు ఎంత దృఢంగా ఉంటుందో అంతకు మించి బలంగా నవ్యాంధ్రప్రదేశ్ భవిష్యత్ ఉండబోతుందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినా దాన్ని గౌరవిస్తూ కేంద్రం ప్రభుత్వం రూ.11,440 కోట్ల భారీ ప్యాకేజీ ప్రకటించ డమే అందుకు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. తాజా పరిణామంతో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అన్న భయాలు కూడా పోయినట్లే అన్నారు. దీని ద్వారా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుంటామని ఎన్నికలకు ముందే ఏదైతే హామీ ఇచ్చామో అది నిలబెట్టుకున్నందుకు మరింత సంతోషంగా ఉందన్నారు. పోలవరం, అమరావతి, పారిశ్రామిక నడ వాలు, ఇప్పుడు విశాఖ ఉక్కుకు వరస ప్యాకేజీలు ప్రకటి స్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాష్ట్రం రుణపడి ఉంటుందని, ముఖ్యమంత్రి చంద్ర బాబు సంకల్పం, ఢిల్లీస్థాయిలో ప్రయత్నాల ఫలితమేనన్నారు. ఇలాంటి రాష్ట్ర దీర్ఘ కాలిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకునే పార్టీలో ఎన్డీయే కూటమిలో చేరిందని గుర్తు చేశారు. మాజీసీఎం జగన్‌రెడ్డి, ప్రస్తుత సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనల మధ్య తేడా ఇదే అన్నారు. జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్థానిక, ఢిల్లీ స్థాయిలో భాజపా నేతల్ని సమన్వయం చేసుకుంటూ పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరి స్తున్నారమన్నారన్నారు.

విశాఖ ఉక్కుకు మహర్దశ : ఆళ్ళ హరి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పోరాటంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మహర్దశ పట్టనుందని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆనందాన్ని వ్యక్తం చేశారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఉక్కు పరిశ్రమకు ఊపిరిలూదుతూ కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్లు కేటాయిం చట్టం పై అయన శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. నాయుడు పేట గోరంట్ల రోడ్డులో ఉన్న విశాఖ ఉక్కు ఉద్యమ సారధి స్వర్గీయ అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. అమృతరావు మనవడు మోహన్ గాంధీని జనసైనికులు దుస్సాలువాతో సత్కరిం చారు. రెల్లి యువ నేత సోమి ఉదయ్ కుమార్, జనసేన నగర కార్యదర్శులు మెహబూబ్ బాషా, బొద్దుపల్లి రాధాకృష్ణ, బందెల నవీన్, డివిజన్ అధ్యక్షులు పవన్ వెంకీ తదితరులు పాల్గొన్నారు.